

## ఆదివాసీలపై వేధింపులు ఆపకుంటే ఉద్యమిస్తాం

■ టైగర్ జోన్ ఏర్పాటు మానుకోవాలి ■ ఆదివాసీలతోనే అడవులకు రక్షణ ■ ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి


# ప్రభాత సమాచారం

https: epaper.
prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ బుధవారం | 4 జూన్ 2025 | ■ 13 పేజీలు




■ ప్లాస్టిక్ కట్టడి ఎలా...?
■ విచ్చల విడిగా కవర్లు, ప్లాస్టిక్ వస్తువులు వినియోగం..
■ నియంత్రించడంలో మున్సిపాలిటీల నిర్లక్ష్యం
■ కవర్లు తిని మూగజీవాల మృత్యువాత
■ నిబంధనలు పాటించని వ్యాపారులు..
■ అధికారుల ఉదాసీనతే కారణమా?
■ గతంలో తనిఖీ అధికారులపై దాడుల సంఘటనలు

# ప్లాస్టిక్ నిషేధంపై ఉక్కుపాదమేది..?

7లో

మంచిర్యాల నగరంతో పాటు జిల్లాలోని లక్షెట్టిపేట, క్యాతన్‌పల్లి, మందమర్రి, చెన్నూరు, బెల్లంపల్లి మున్సిపాలిటీల్లో పెద్ద ఎత్తున ప్లాస్టిక్ వినియోగం జరుగుతోంది. ప్లాస్టిక్ కవర్లు, వస్తువులను వ్యాపారులు విచ్చలవిడిగా విక్రయిస్తుండగా, వినియోగదారులు సైతం వాటిని విరివిగా వాడుతున్నారు. మంచిర్యాల నగర పాలక సంస్థ పరిధిలో ప్రతీ రోజు చెత్త సేకరణలో సగానికంటే ఎక్కువ ప్లాస్టిక్ వస్తువులే లభిస్తున్నాయి. ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నిషేధించినా.. కొంత మంది వ్యాపారులు మాత్రం యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. ఇదంతా తెలిసినా సంబంధిత శాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం పట్ల పలు అనుమానలు వ్యక్తమవుతున్నాయి. ప్లాస్టిక్ ద్వారా అనేక ఆరోగ్యపరమైన సమస్యలు వస్తాయని ప్రజలకు తెలినప్పటికీ వాటినే వాడుతున్నారు.



## మహారాష్ట్రలోనే ఏనుగుల సంచారం

మహారాష్ట్రలోని మూల్ తాలూకాలోని సింధెయి
అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న ఏనుగుల మంద
గడ్చిరోలి వరకు వచ్చి తిరిగి పంబూరా అటవీలోకి..
ఏనుగుల కదలికలపై అటవీ అధికారుల ప్రత్యేక నిఘా

13

అధికారుల ప్రకటనతో సరిహద్దు మండలాల ప్రజలకు ఊరట



తెలంగాణ సరిహద్దు వరకు ఏనుగులు వస్తున్నాయనే హెచ్చరికల నేపథ్యంలో కొంత ఊరట లభించింది. తాజా సమాచారం మేరకు ఏనుగులు మహారాష్ట్రలోని మూల్ తాలూకాలోని సింధెవాయి అటవీ ప్రాంతంలో ఉన్నట్లు తెలుస్తోంది. మంగళవారం జిల్లా అటవీ అధికారి నీరజ్ టిబ్రెవాల్, కాగజ్‌నగర్ అటవీ డివిజన్ అధికారి సుశాంత్ బొగాడె అధికారులను అప్రమత్తం చేశారు. మహారాష్ట్ర అటవీ అధికారుల ద్వారా సమాచారం తెలుసుకున్నారు.

అభివృద్ధిని విధ్వంసం చేసే..

## చరిత్ర మహేశ్వర్ రెడ్డిది



రైతులు మత్స్యకారుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని తాను చెక్ డ్యాములు నిర్మిస్తే నిర్మల్ ఎమ్మెల్యేగా గెలిచిన మహేశ్వర్‌రెడ్డి వాటిని విధ్వంసం చేసి చరిత్ర హీనులుగా మిగిలిపోతున్నారని మాజీ మంత్రి అల్లోల విమర్శించారు.




## అంతర్జాతీయ వేదికపై ఆర్జీయూకేటీ విద్యార్థులు

**హైదరాబాద్ ఐఐటీలో స్పిక్ మెకే పదో అంతర్జాతీయ సమ్మేళనం**

ఐఐటీ హైదరాబాద్‌లో స్పిక్ మెకే 10వ అంతర్జాతీయ సమ్మేళనం వారం రోజుల పాటు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సమ్మేళనంలో నిర్మల్ జిల్లా బాసరలోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ) నుంచి 35 మంది విద్యార్థులు ఇందులో ఉత్సాహంగా పాల్గొన్నారు. విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ, విద్యార్థులు తమ సాంస్కృతిక చైతన్యం, దేశీయ కళలపై గౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పారని తెలిపారు. ఈ అవకాశం వారి వ్యక్తిత్వ వికాసానికి ఒక గొప్ప వేదికగా నిలిచిందని పేర్కొన్నారు.

## భూ భారతి జాతర

### పరిష్కార సదస్సులు

■ ఊరూరా ప్రారంభమైన రెవెన్యూ సదస్సులు ■ అర్జీలు అందజేస్తున్న రైతులు
■ రెవెన్యూ సదస్సులను రైతులు వినియోగించుకోవాలి ■ ఉమ్మడి జిల్లా కలెక్టర్లు
■ క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్లు ■ తొలి రోజు సదస్సులకు పోటెత్తిన జనం

భూ సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఊరూరా సదస్సులు ప్రారంభమయ్యాయి. తొలి రోజు రైతులు సమస్యలపై అధికారులకు వినతులు అందజేశారు. అధికారులు నిర్ణయించిన ప్రకారం ఈ నెల 20 తేదీ వరకు జరగనున్నాయి. అనంతరం రెవెన్యూ అధికారులు గ్రామాల్లో పర్యటించి అందిన సమస్యపై విచారణ చేయనున్నారు. తొలి రోజు సదస్సులను ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాల కలెక్టర్లు రాజర్షి షా, అభిలాష అభినవ్, కుమార్ దీపక్ పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడుతూ.. రైతులను ఇబ్బంది పెట్టవద్దన్నారు. హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

- సమగ్ర వార్తలు లోపలి పేజీల్లో

Revenue Sadassu





## భూ సమస్యలశాశ్వత

# పరిష్కారానికి భూ భారతి

### భూభారతి చట్టంతో భూ సమస్యల పరిష్కారం - నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్





**లక్ష్మణచందా, జూన్ 3 (ప్రభాత సమాచారం)**
రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న భూభారతి చట్టం వల్ల ప్రజల భూ సమస్యలు త్వరగా పరిష్కారం పొందుతున్నాయని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. మంగళవారం లక్ష్మణచందా మండలం కనకాపూర్, నిర్మల్ గ్రామీణ మండలం అక్కపూర్‌లో నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సుల్లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల భూ సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యం. ఇందుకోసమే భూభారతి చట్టాన్ని తీసుకొచ్చారని తెలిపారు. ఇప్పటికే తొలి విడత సదస్సులు విజయవంతంగా ముగిశాయని, నేటి నుండి జూన్ 20వ తేదీ వరకు రెండో విడత రెవెన్యూ సదస్సులు జరుగుతాయని వెల్లడించారు. సదస్సుల్లో పాల్గొన్న ప్రజల భూములకు సంబంధించిన సమస్యలను కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ అధికారులు ప్రజల దరఖాస్తులను స్వీకరించి, వెంటనే రసీదులు ఇవ్వాలని ఆదేశించారు. సకాలంలో సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం అక్కపూర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో హెల్ప్‌డెస్క్, రిజిస్టర్లను కలెక్టర్ పరిశీలించి, రైతుల భూసమస్యల దరఖాస్తులపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం పాఠశాలలో తరగతిగదులు, ఇంకుడు గుంత, లైటింగ్ వంటి వసతులను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, తహ సీల్దార్లు సరిత, సంతోష్, ఎంపీడీవో గజానన్, గిర్దావర్ సంతోష్ కుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



## రైతులకు నాణ్యమైన విత్తనాల పంపిణీ

**బెల్లంపల్లి, జూన్ 3 (ప్రభాత సమాచారం)**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాణ్యమైన విత్తనం-రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా బెల్లంపల్లి వ్యవసాయ అధికారులు మంగళవారం నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనం – రైతు నేస్తం కార్యక్రమం ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించారు. బెల్లంపల్లి మండలంలో వరి కేఎన్ఎం 1210 రకం సన్న వడ్ల విత్తన సంచులు 10 ఏ 10 కేజీల 10 బస్తాలు పెసర ఎంజీజీ 347 ఏ3 కేజీ బ్యాగ్‌లను ఎంపిక చేసిన రైతులకు పంపిణీ చేశారు. ప్రతి రెవెన్యూ గ్రామానికి ఇద్దరు రైతులకు రూ.50 నామినల్ ఛార్జీలు తీసుకొని విత్తన బస్తాలు పంపిణీ చేశారు. విత్తనాలు పొందిన రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ పర్యవేక్షణలో విత్తనోత్పత్తిలో మెలుకువలు నేర్చుకునీ వితానోత్పత్తి చేయిస్తారు. తద్వారా వచ్చిన విత్తనాలను అదే గ్రామంలోనీ ఇతర రైతులకు విత్తనాలు ఇవ్వాలన్నది ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం అని మండల వ్యవసాయ అధికారి ప్రేమ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ చింతంస్వామి, బెల్లంపల్లి ఏడీఏ రాజానరేందర్, ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ రత్నాకర్, ఏఈఓఎస్ తిరుపతి, ఏఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు

**జన్నారం, జూన్ 3 (ప్రభాత సమాచారం)**
భూ సమస్యల పరిష్కారం కోసమే భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని మండల తహశీల్దార్ రాజ మనోహర్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం జన్నారంలోని రేండ్లగూడ కార్యాలయంలో భూభారతి రెవెన్యూ సదస్సును నిర్వహించారు. భూ సమస్యలపై ప్రజలు, రైతులు ఇచ్చిన అర్జీలను స్వీకరించారు. ఆయా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామని తహశీల్దార్ స్పష్టం చేశారు. అలాగే మండలంలోని రాంపూర్ గ్రామంలో భూ రెవెన్యూ సదస్సును గ్రామపంచాయతీ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ రామ్మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామం నుంచి రైతులు ఇచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఆన్లైన్ మీ సేవ కేంద్రాల్లో ఇచ్చిన



దరఖాస్తులు కాకుండా, నేరుగా ఇప్పుడు ఇచ్చిన దరఖాస్తులను మాత్రమే పరిష్కరిస్తామన్నారు. ఏఎంసీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, పిఏసిఎస్ చైర్మన్ రవి, ఆర్ఐలు భానుచందర్, గంగరాజా, కార్యదర్శి శ్రీనివాస్, కరుణాకర్, వెంకటరాజ్యం, ప్రభుదాస్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## స్టైఫెండ్ విడుదల చేయాలని వినతి



**నిర్మల్, జూన్ 3 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో బీసీ న్యాయవాదులకు ప్రభుత్వం చెల్లించి స్థాయి ఫండ్‌ను వెంటనే విడుదల చేయాలని కోరుతూ బీసీ న్యాయవాదుల సంఘం మంగళవారం జిల్లా అధికారి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. న్యాయవాదుల సమస్యలను పరిష్కరించాలని స్థాపన విడుదల కాకపోవడంతో న్యాయవాదులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. 2014 నుండి 2025 వరకు గల నోటిఫికేషన్లను, విడుదల చేయకపోవడం వలన బీసీ న్యాయవాదులకు తీవ్ర అన్యాయం జరిగింది కాబట్టి ఇప్పటికైనా ప్రభుత్వం జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి, బీసీ న్యాయవాదుల ట్రైనింగ్ స్టైఫండ్ నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని నిర్మల్ బీసీ న్యాయవాదులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తీవ్రమైన ఆందోళన కార్యక్రమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, రమణ, రాజు, రమణ, ఎస్ రాజు, న్యాయవాదులు పాల్గొన్నారు.



### ఆదివాసీ, గిరిజనులపై వేధింపులు

## ఆపకుంటే ఉద్యమిస్తాం

### టైగర్ జోన్ ఏర్పాటును మానుకోవాలి

### ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

**ఆసిఫాబాద్, జూన్ 3 (ప్రభాత సమాచారం)**
కాంగ్రెస్ ప్రభుత్వంలో పోడు వ్యవసాయం చేస్తున్న రైతులపై అటవీ శాఖ అధికారులు అక్రమ కేసులు పెట్టి దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి తొత్తులుగా అధికారులు పనిచేస్తున్నారని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట అధికారుల వేధింపులకు నిరసనగా ఆదిమ, గిరిజన భూరక్షణ పోరాట కమిటీ, రాజ్‌గోండ్ సేవా సమితి, గోండ్వాన పంచాయతీ రాయి సెంటర్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షకు ఎమ్మెల్యే కోవ లక్ష్మి మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదివాసీ గ్రామాల్లో అభివృద్ధి పనులను అడుకుంటున్నారని ఆరోపిస్తూ నిరసన తెలిపారు. టైగర్ జోన్ ఏర్పాటును మానుకోవాలని, టైగర్ జోన్ ఏర్పాటు పేరుతో ఆదివాసీ గిరిజనులను ఇబ్బందులకు గురి చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఎమ్మెల్యే కోవలక్ష్మి హెచ్చరించారు. ఆదివాసీ గిరిజనులతోనే అడవుల మనుగడ సాధ్యమని, అటవీ హక్కు పట్టాలు ఉన్న.. పోడు సాగు పేరుతో వారిని అటవీ అధికారులు ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. అటవీ అధికారుల ఇబ్బందుల నేపథ్యంలో ఖరీఫ్ సాగు చేయాల్సిన రైతులు పనులు మానుకుని ఆందోళన చెందాల్సిన వస్తోందని వాపోయారు. ఆదివాసీల కోసం జల్ జంగల్ జమీన్ అనే నినాదంతో గిరిజన హక్కులు సాధించిన కుమ్రం భీం పోరాటాన్ని గుర్తు చేశారు. ఆదివాసీ గ్రామాలకు రహదారి నిర్మాణం కోసం అటవీ శాఖ అధికారులు అనుమతివ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని మిగులు భూములకు పట్టాలు ఇవ్వడంతో పాటు పట్టా ఉన్న వ్యక్తి చనిపోతే వారి కుటుంబ సభ్యులకు పట్టా చేసి ఇవ్వాలనానరు. ఆదివాసుల కోసం ఎప్పుడు అండగా ఉంటాఅని, ఇప్పటికైనా అధికారులు స్వేచ్ఛగా గిరిజనుల హక్కులకు అడ్డు రాకుండా శాంతి యుతంగా ఉండాలన్నారు. లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు కార్యక్రమంలో వివిధ గిరిజన పోరాట సమితి, సంఘాలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లతో సొంతింటి కల సహకారం



### ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందించిన ఎమ్మెల్యే వినోద్

**బెల్లంపల్లి, జూన్ 3 (ప్రభాత సమాచారం)**
ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంతో పేద ప్రజల సొంతింటి కల నెరవేరిందని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. తాండూర్ మండలం కొత్తపల్లి గ్రామ పంచాయతీలోనీ పెగడపల్లి గ్రామంలో మంగళవారం నూతన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించి నూతన ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను 20 మంది లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యం లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. అందులో బాగానే సీఎం రేవంత్ రెడ్డి పేద ప్రజలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశారన్నారు. చిరకాలంగా నిలువ నీడలేని ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లతో వారి కళ్ళల్లో ఆనందాన్ని కల్పించుదన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా రెవెన్యూ శాఖ కీలక భూమిక నిర్వహిస్తుందన్నారు. రైతుల భూ సమస్యలను తీర్చడానికి తీసుకొచ్చిన గొప్ప చట్టం భూభారతి అని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం ప్రజల వద్దకే పాలనలో భాగంగా రైతుల కోసం గ్రామాలకు రెవెన్యూ అధికారులు తరలి వచ్చారన్నారు. భూభారతి రెవెన్యూ సదస్సులో ఏర్పాటు చేసిన హెల్ఫ్ డెస్క్, వద్ద సదుపాయాలను పరిశీలించి, రైతులు సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి తీసుకొచ్చామని పేర్కొన్నారు. గతంలో ఉన్న ధరణిలో అనేకలోపాలు ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ధరణి స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకొచ్చేందుకు మేధావులు, రైతు సంఘాలు, అందరితో చర్చించి గత చట్టంలోని లోపాలను సవరిస్తూ కొత్త చట్టం భూ భారతి ని తీసుకొని వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో హరి కృష్ణ, ఎమ్మార్వో జోష్ణ, ఎంపీడీవో శ్రీనివాస్, సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## రైతులకు విత్తన వినియోగంపై
# అవగాహన కల్పించాలి

- నిషేధిత విత్తనాలు, పురుగు మందుల వాడకం వల్ల కలిగే నష్టాలను రైతులకు వివరించాలి
- విత్తనాలు, ఎరువులు అందబాటులో ఉంచుకోవాలి
- నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే క్రమినల్ కేసులు నమోదుతో పాటు పీడీ యాక్ట్ అమలు
- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, జూన్ 3 (ప్రభాత సమాచారం)**

రానున్న వానాకాలం పంటల సాగులో రైతులకు విత్తన వినియోగంపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ అధికారి కల్పనతో కలిసి మండల వ్యవసాయ అధికారులు, ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందుల డిస్ట్రిబ్యూటర్లు, డీలర్లు, రిటైలర్లు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వానాకాలం పంటల సాగులో విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల కొనుగోలు, వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. సీజన్లో పంట సాగుకు అవసరమైన వరి, పత్తి విత్తనాల లభ్యతను పరిశీలించుకొని ఏదైనా కొరత ఉన్నట్లయితే ముందుగానే సిద్ధం చేసుకోవాలని తెలిపారు. వర్షాలు, విత్తనాలు నాటడం, ఎరువుల వినియోగం అంశాలపై రైతులకు అవసరమైన మెళకువలను అందించాలని, నకిలీ, నిషేధిత విత్తనాలు, ఎరువుల వినియోగం కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. విత్తనాలు, ఎరువుల దుకాణాలలో రైతులు కొనుగోలు చేసిన సమయంలో సంబంధిత అంశాలతో కూడిన రశీదు జారీ చేయాలని, ప్రతి షాపులో ఉన్న నిల్వలు, విక్రయ వివరాలు, రిజిస్టర్లో నమోదు చేయాలని, రైతులకు తెలిసే విధంగా ధరల పట్టిక, పూర్తి వివరాలు నోటీస్ బోర్డు ద్వారా ప్రదర్శించాలని తెలిపారు. ఈ-పాస్ యంత్రంలో నమోదు చేసి ప్రకారం నిల్వలు ఉండాలని, ఎలాంటి తేడాలు ఉండకూడదని తెలిపారు. జిల్లాలో అవసరమైన మేరకు యూరియా అందుబాటులో ఉంచే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఒక్కసారిగా విక్రయించకుండా అవసరం తెలుసుకొని తదనుగుణంగా విక్రయాలు జరుపాలని తెలిపారు. ఎరువులు, క్రిమిసంహారక మందుల విక్రయ సమయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని, అర్హత గల రైతులకు మాత్రమే విక్రయించాలని తెలిపారు. ఇప్పటి వరకు దాదాపుగా పత్తి విత్తనాలు అందించడం జరిగిందని, సరిపడా నిల్వలు ఉన్నాయని, అవసరమైన రైతులు తీసుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వంచే గుర్తించబడిన విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు మాత్రమే విక్రయించాలని, నకిలీ, నిషేధిత అంశాలను విక్రయించినట్లయితే సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



### జన్నారం మండల నూతన
## ఎస్సైగా గొల్లపల్లి అనూష
### మొదటి సారిగా జన్నారానికి మహిళా ఎస్సై

**జన్నారం, జూన్ 3 (ప్రభాత సమాచారం)**



జన్నారం నూతన ఎస్సైగా గొల్లపెల్లి అనూషను రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు చేశారు. దీంతో మండలంలో మొదటి సారి మహిళ ఎస్సై నియామకం అయ్యారు. ఇక్కడ పనిచేసిన గుండేటి రాజ వర్ధన్‌ను రామగుండం సీపీ కార్యాలయానికి వీఆర్‌కు అటాచ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో వీఆర్‌గా విధులు నిర్వహిస్తున్న గొల్లపల్లి అనూష, జన్నారానికి బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేసిన రాజవర్ధన్ 2024 మార్చిలో బాధ్యతలు స్వీకరించి, ఇప్పటి వరకు 14 నెలల పాటు శాంతి భద్రతల పరిరక్షణ, కేసుల ఛేదనలో ప్రత్యేక చొరవ చూపారు.

### ఆన్ లైన్ మోసల పట్ల
## అప్రమత్తంగా ఉండాలి

**లక్షెట్టిపేట, జూన్ 3 (ప్రభాత సమాచారం)**



ఆన్లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సురేష్ మంగళవారం మున్సిపల్, మండల ప్రజలను పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ... తెలినటువంటి నంబర్ల నుండి ఇంటి టాక్స్, బండి ఇన్సూరెన్స్, షాప్స్ సంబంధించిన ట్రేడింగ్ లైసెన్స్,సీసీ కెమెరాలకి సంబంధించిన లైసెన్స్ గురించి మున్సిపల్ ఆఫీస్ నుంచి లేదా జిపి ఆఫీసు నుండి ఫోన్ చేస్తున్నాం అని చెప్పి వాటికి పర్మిషన్ తీసుకోలేదని ఎవరు కాల్ చేసినా నమ్మవద్దని మున్సిపాలిటీకి సంబంధించిన ట్యాక్సీ కట్టలేదని ఎవరు తెలియని వ్యక్తులు పంపిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయవద్దని, షాప్‌కు సంబంధించిన లైసెన్స్ రెనివల్ అయిపోయిందని చెప్పిన నమ్మవద్దని నేరుగా సంబంధిత ఆఫీసుకి వెళ్ళి తెలిసుకొని డబ్బులు కట్టాలని తెలిపారు.

# వర్షాకాలంలో పారిశుధ్య పనులు నిర్వహించాలి




### నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**నిర్మల్, జూన్ 3 (ప్రభాత సమాచారం)**

వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌లు నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో సంబంధిత శాఖల అధికారులతో ఆయన చర్చించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజారోగ్య పరిరక్షణలో నిమగ్నమైన ప్రతి శాఖ సమన్వయంతో పని చేయాలని, బాధ్యతల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని ఉపేక్షించేది లేదన్నారు. మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ప్రాధాన్యత గల ప్రాంతాల్లో డ్రెయిన్‌లు పూర్తిగా శుభ్రపరచాలని, నీటి నిల్వలు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. శానిటేషన్ కార్యక్రమాల్లో పాల్గొనే కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని, పని ప్రమాణానికి అనుగుణంగా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. మలేరియా దోమల నియంత్రణకు ఆయిల్ బాల్స్ స్ప్రే చేయాలనీ ఆదేశించారు.గ్రామ, వార్డు వలంటీర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంల ద్వారా ప్రజల్లో శుభ్రతపై అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రానున్న వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

అలాగే పాఠశాలలు, హాస్టళ్లు, ఆంగన్‌వాడీ కేంద్రాల పునః ప్రారంభానికి అవసరమైన ఏర్పాట్లు, బడి బాట కార్యక్రమం, చిన్న మరమ్మత్తులు, యూనిఫాం కుట్టింపు, పాఠ్యపుస్తకాల పంపిణీ వంటి అంశాలపై మండలాల వారీగా చర్చించారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కల నాటేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు అదనపు కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో జడ్పీ సిఈఓ గోవింద్, పిడిడి ఆర్‌డిఓ విజయలక్ష్మి, డిపిఓ శ్రీనివాస్, డిఈఓ రామారావు, సంక్షేమ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

**మందమర్రి, జూన్ 3 (ప్రభాత సమాచారం)**

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని ప్రతీ ఒక్కరు తమదైనందిన జీవితంలో యోగాను ఆచరించి ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని ఆయుష్ వైద్యురాలు నీరజ, యోగా శిక్షకులు కొంపెల్లి రమేష్ కుమార్‌లు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంను పురస్కరించుకొని మంగళవారం అవగాహన ర్యాలీ, యోగ వాక్ చేపట్టారు. ఈ ర్యాలీ పట్టణంలోని పాత బస్టాండ్ హెచ్‌పీ పెట్రోల్ బంక్ నుండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుష్ వైద్యురాలు, యోగా శిక్షకులు మాట్లాడుతూ... శరీర ఆరోగ్యానికి యోగ తప్పనిసరని ప్రతి ఒక్కరు యోగాను విధిగా ఆచరించాలని కోరారు. యోగాతో కలిగే ఉపయోగాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం జూన్ 21న యోగా దినోత్సవం నిర్వహించి ప్రజల్లో అవగాహన పెంపొందించడం జరుగుతుందన్నారు. ప్రతిరోజు యోగా సాధన ద్వార శారీరకంగా, మానసికంగా, దృఢంగా



ఉంటామని ఎక్కువ సమయం వెచ్చించలేని వారు కనీసం ప్రాణాయామం ఆచరించి ఆరోగ్యంగా సంపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజి ప్రధాన కార్యదర్శి సొత్కు సుదర్శన్, భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు రామటెంకి దుర్గరాజ్, పాత బస్టాండ్ వ్యాపార సంఘం అధ్యక్షులు వడ్లకొండ కనకయ్య, సభ్యులు నాకోటి వెంకటేశ్వర్లు, మార్కండేయ, బింగి రాజన్న యోగ శిక్షకులు రామ్మోహన్, శిక్షకురాలు శైలజలు పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## క్లస్టర్ ఏఈవోగా తిరుపతి

**బెల్లంపల్లి, జూన్ 3 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లి క్లస్టర్ ఏఈఓగా తిరుపతి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఒప్పంద ఏఈవో అంజలి విధుల కాలపరిమితి ముగిసింది. ఆమె స్థానంలో తిరుపతి ఇన్‌సర్వీస్ కోటాలో పొలాస వ్యవసాయ కళాశాలలో 4 సంవత్సరాలు వ్యవసాయవిద్యను పూర్తి చేసుకొని విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండి సాగులో మెలుకువలు నేర్పుతూ రైతులకు తన వంతు సేవలు అందిస్తానన్నారు.





### జిల్లాలో బడిబాట కార్యక్రమాన్ని

# విజయవంతం చేయాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, జూన్ 3 (ప్రభాత సమాచారం)** బడి వయస్సు గల పిల్లలు, బడి బయట పిల్లలు తప్పని సరిగా పాఠశాలలో ఉండే విధంగా ప్రొ॥జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్యతో కలిసి పంచాయతీ, గ్రామీణాభివృద్ధి, విద్య, షెడ్యూల్డ్ కులముల సహకార, అభివృద్ధి, గిరిజన సంక్షేమ, వెనుకబడిన తరగతుల అభివృద్ధి, మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులతో బడిబాట కార్యక్రమ నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీ వరకు జరగనున్న ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేసి విజయవంతం చేయాలని తెలిపారు. ఈ నెల 6వ తేదీన అన్ని గ్రామాలలో, మున్సిపాలిటీలలో బడిబాట కార్యక్రమం ద్వారా చేపట్టబోయే కార్యక్రమాలపై గ్రామసభలు నిర్వహించి బడి బయట ఉన్న పిల్లలు, 5 సంవత్సరాల వయసు నిండిన ప్రతి ఒక్కరిని పాఠశాలలో చేర్పించే విధంగా కార్యచరణ చేపట్టాలని, స్వయం సహాయక సంఘాలు, ఎ.ఎ.పి.సి. సభ్యులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వసతిగృహాల సంక్షేమ అధికారులు, పాత విద్యార్థుల భాగస్వామ్యంతో మారుమూల ప్రాంతాలలో అవగాహన కల్పించాలని తెలిపారు. 7వ తేదీన ఇంటింటిని సందర్శించి బడి వయస్సు పిల్లలను నమోదు చేయాలని, జాబితా తయారు చేయాలని తెలిపారు. 8వ తేదీ నుండి 10వ తేదీ వరకు అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పిల్లలను బడిలో చేర్పించాలని, పాఠశాలలో విద్యార్థులకు కల్పించే సౌకర్యాలను వివరించాలని, భవిత కేంద్రాలకు పిల్లలకు పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. 11వ తేదీన 10వ తేదీ వరకు జరిగిన కార్యక్రమ పురోగతిపై చర్చించి, 12వ తేదీ నుండి కార్యచరణ ప్రకారంగా రోజువారి కార్యక్రమాలపై చర్చించి అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. 12వ తేదీన పాఠశాలల పున:ప్రారంభించబడి విద్యా సంవత్సరం ప్రారంభమవుతుందని, బడిబాట కార్యక్రమం ఆవశ్యకత తెలిసేలా పండగ వాతావరణంలో పాఠశాలలను అందంగా ముస్తాబు చేయాలని, తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించి ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని, నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, వర్క్‌బుక్స్, ఏకరూప దుస్తుల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించాలని, గత విద్యా సంవత్సరంలో విద్యా సంబంధిత అంశాలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలలో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసలు అందించాలని తెలిపారు.

13వ తేదీన సామూహిక అక్షరాభ్యాసం, బాలసభల కార్యక్రమాలు నిర్వహించాలని, 16వ తేదీన అక్షరాభ్యాస మెరుగుదల కార్యక్రమంలో భాగంగా విద్యార్థులను ఉత్సాహపరుస్తూ సబ్జెక్టుల వారిగా రంగురంగుల పోస్టర్లతో తరగతి గదులను ఆకర్షణీయంగా తయారు చేయాలని, పిల్లలకు సరళమైన, సరదా కథలు వినిపించాలని, గ్రామాలలో విద్య ఆవశ్యకతను తెలియజేసేలా ప్లకార్డులతో ర్యాలీలు నిర్వహించాలని తెలిపారు. 17వ తేదీన సమ్మిళిత, బాలికా విద్యా దినోత్సవాన్ని నిర్వహించాలని, భవిష్యత్ ప్రణాళికలు, బాల్య వివాహాలు, పిల్లలపై వేధింపులకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించాలని, ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి తగు సౌకర్యాలు కల్పించి భవిత కేంద్రాలు, పాఠశాలలకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, 100 శాతం బడి వయస్సు గల పిల్లలు పాఠశాలలో ఉండేలా చూడాలని తెలిపారు. 18వ తేదీన తరగతుల డిజిటలైజేషన్, మొక్కల పెంపకం అంశాలను నిర్వహించాలని, 19వ తేదీన క్రీడా దినోత్సవాన్ని నిర్వహించాలని తెలిపారు. జిల్లా, మండల, పాఠశాల స్థాయిలలో బడిబాట డెస్కను ఏర్పాటు చేయాలని, స్థాయిల వారిగా ఇన్చార్జ్‌ను నియమించి పిల్లలను బడిలో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరిశ్రమలలో, ఇటుక బట్టీలలో, హెూటళ్లలో పని చేసే బాల కార్మికులను గుర్తించాలని, ముఖ్యంగా బాలికలు ప్రతి ఒక్కరూ పాఠశాలలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామాలలో పంచాయతీ కార్యదర్శి, ఆశ, ఆరోగ్య కార్యకర్తలు గ్రామాలలో ఉండే ప్రజాప్రతినిధులు, కుల పెద్దలు, స్వయం సహాయక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలతో సమన్వయం చేసుకోవాలని, బడిబాట కార్యక్రమం ద్వారా అర్హత కలిగి 5 సంవత్సరాల వయసు నిండిన ప్రతి ఒక్కరు బడిలో ఉండే విధంగా సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే అన్ని పాఠశాలలు, వసతి గృహాలలో పారిశుద్ధ్యం నిర్వహించి బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేయాలని, పాఠశాలలు పున:ప్రారంభం నుండే వార్షిక ఫలితాలపై దృష్టి సారిస్తూ కార్యచరణ ప్రకారంగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, ఉపాధ్యాయుల పనితీరుపై క్లస్టర్లుగా విభజించి సమీక్షించడం జరుగుతుందని తెలి పారు. ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వ ర్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు సకల సదుపాయాలు కల్పిస్తూ నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని, ఈ విషయంపై విస్తృత ప్రచారం నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్యను పెంపొందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల ఖాతాలలో రూ.328 కోట్లు జమ

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, జూన్ 3 (ప్రభాత సమాచారం)** జిల్లాలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి వరి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 345 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 321 కేంద్రాలు ద్వారా 28 వేల 328 మంది రైతుల వద్ద నుండి 1 లక్ష 93 వేల 323 టన్నుల వరిధాన్యం కొనుగోలు చేసి సంబంధిత రైతుల ఖాతాలలో 315 కోట్ల 12 లక్షల రూపాయలు జమ చేయడం జరిగిందని తెలిపారు. రైతుల వద్ద నుండి పూర్తి స్థాయిలో నిబంధనల ప్రకారం వరిధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేసిన 313 కొనుగోలు కేంద్రాలను మూసి వేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన వరిధాన్యంను రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి కనీస మద్దతు ధర పొందాలని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రతి రోజు 1 వేయి 500 మంది సిబ్బంది, హమాలీలు యజ్ఞంలా పని చేస్తున్నారని, నిత్యం 2 వేల నుండి 4 వేల టన్నుల ధాన్యం కాంటా చేసి 90 లారీల ద్వారా 2 వేల నుండి 3 వేల టన్నుల ధాన్యం పెద్దపల్లిలోని 110 మిల్లులకు, జిల్లాలోని 22 మిల్లులకు తరలించడం జరుగుతుందని, మిల్లుల వద్ద ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగంగా జరుగుతుందని తెలిపారు. ప్రతి రోజు 10 నుండి 20 కోట్ల రూపాయలు రైతుల ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని, రైతు పండించిన ధాన్యం నష్టపోకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.



## సీజనల్ వ్యాధుల పట్ల

# అప్రమత్తంగా ఉండాలి

**ఇచ్చోడ, జూన్ 3 (ప్రభాత సమాచారం)** సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాథోడ్ నరేందర్ సూచించారు. మంగళవారం మండలంలోని నర్సాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా వైద్యాధికారి డాక్టర్ సాధన, డిఐఓ డాక్టర్ శ్రీనివాస్,డీ ఎంఓ శ్రీధర్, ఎస్ఓ బ్రహ్మానంద రెడ్డి,డాక్టర్ హిమబిందు, ఆశవర్కర్‌లు పాల్గొన్నారు.

## రైతులకు విత్తనాల పంపిణీ

**ఆదిలాబాద్, జూన్ 3 (ప్రభాత సమాచారం)** పప్పు ధాన్యాలు పండించడానికి నాణ్యమైన విత్తనాలు రైతులకు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతు నేస్తం కార్యక్రమానికి నిర్వహిస్తోందని కె.వి.కె వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ సునీల్ అన్నారు. మంగళవారం గాదిగూడ మండలంలోని రైతువేదికలో రైతులకు పప్పు దినుసుల విత్తనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏవో వెంకన్న, ఏఎంసి వైస్ చైర్మన్ మారుతి, సిపిఎఫ్ సంస్థ ప్రతినిధి దిలీప్, ఏఈఓ యోగిరాజ్ పాల్గొన్నారు.



## ఇంటిగ్రేటెడ్ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీశ్‌రాజ్**

**మంచిర్యాల, జూన్ 3 (ప్రభాత సమాచారం)** జిల్లాలో నిర్వహించే ఇంటిగ్రేటెడ్ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి హరీశ్ రాజ్ అన్నారు. పాతమంచిర్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్య శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వందరోజుల పాటు ఇంటిగ్రేటెడ్ వైద్య శిబి రాలను నిర్వహిస్తామన్నారు. జాతీయ క్షయ నివారణ, హెచ్ఐవీ ఎయిడ్స్ అసంక్రమణ వ్యాధులు, హెపటైటీస్ బీసీ వాటిపైన ప్రజల్లో పరీక్షలు చే యడం, అవగాహన కలిగిస్తామన్నారు. వారంలో నాలుగు రోజుల పాటు నెలకు 16 రోజులు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని ఆయా వైద్యాధికారులు, వైద్య సిబ్బంది ఆశ, ఆరోగ్య కార్యకర్తలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆకాంక్షించారు. 102 సిబ్బంది వాహనాలను ఆర్‌బీఎస్‌కే సిబ్బంది వారి సేవలను ఐసీటీసీ సేవలను ఎక్స్‌రే చేయడానికి జిల్లా ప్రభుత్వ ఆసు పత్రి టెక్నిషియన్లు సేవలను సమన్వయంతో చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు నరేశ్, డాక్టర్ సుధాకర్ నాయక్, డాక్టర్ ప్రసాద్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శివప్రతాప్, డాక్టర్ అమర్, డాక్టర్ రాము, డాక్టర్ రజిత, సిబ్బంది పాల్గొన్నారు.



## డిగ్రీ విద్యార్థులకు ఉచిత వసతి

**ఉట్నూర్, జూన్ 3 (ప్రభాత సమాచారం)**



ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు ఉచితంగా హాస్టల్ వసతి సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రతాప్ సింగ్ పేర్కొన్నారు. ఇంటర్ పాస్ అయిన విద్యార్థులకు డిగ్రీలో చదువుకునేందుకు మంచి అవకాశమని, బాలురు, బాలికలకు ప్రత్యేకంగా ఉచిత హాస్టల్స్ వసతి సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలన్నారు.

# ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి



## కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా

**కౌటాల, జూన్ 3 (ప్రభాత సమాచారం)**
వరి ధాన్యాన్ని పకడ్బందీగా కొనుగోలు చేయాలని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా సూచించారు. సాండ్గాం గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం వెంటవెంటనే కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని జాప్యం చేయకుండా రైస్ మిల్లులకు తరలించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో హమాలీల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తహసీల్దార్ ప్రమోద్, నిర్వాహకులున్నారు.

**యోగా శిక్షణ కేంద్రం ప్రారంభం...**
కౌటాల మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో జన భవిత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత యోగా, ధ్యాన శిక్షణ కేంద్రాన్ని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా ప్రారంభించారు. కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీఐ రమేష్, ఎంపీడీవో రమేష్, పంచాయతీ కార్యదర్శి సాయి కృష్ణ, ట్రస్ట్ చైర్మన్ వరలక్ష్మి, జిల్లా అధ్యక్షుడు సురేష్, బీజేపీ జిల్లా కార్యదర్శి రాజేందర్ గౌడ్, మండలాధ్యక్షుడు విజయ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మోతీరాం, పతంజలి జిల్లా అధ్యక్షుడు రవీందర్, యోగా శిక్షకుడు వినోద్ గౌడ్ పాల్గొన్నారు.



## రాష్ట్రస్థాయి జూనియర్
# తైక్వాండో పోటీల్లో ప్రతిభ

**బెల్లంపల్లి, జూన్ 3 (ప్రభాత సమాచారం)**
రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో మే31 వ తారీకు నుండి జూన్ 2 వ తారీఖు వరకు ఘట్కేసర్‌లో ని ఆర్యవైశ్య భవన్లో జరిగిన 34వ సబ్ జూనియర్, జూనియర్ రాష్ట్రస్థాయి తైక్వాండో ఛాంపియన్షిప్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుండి 40 మంది తైక్వాండో క్రీడాకారులు వివిధ కేటగిరీలలో పాల్గొని పథకాలు సాధించి జాతీయస్థాయికి ఎంపికయ్యారని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తైక్వాండో అధ్యక్ష,కార్యదర్శులు బుచ్చి రామారావు, మాస్టర్ జిల్లపల్లి వెంకటస్వామి తెలిపారు. తైక్వాండో పోటీలలో గోల్డ్ మెడల్స్ 8, సిల్వర్ మెడల్స్ 14, బ్రాంజ్ మెడల్స్ 18, సాధించారని,వీరిలో 8 మంది ఈనెల ఉత్తరఖండ్ లో జరిగే జాతీయస్థాయి ఛాంపియన్ షిప్ లో తెలంగాణ రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు.

# మహాసభలను జయప్రదం చేయండి



**నిర్మల్, జూన్ 3 (ప్రభాత సమాచారం)**
టియుసిఐ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 21, 22 తేదీల్లో నిర్వహించే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజన్న తెలిపారు. మంగళవారం మహాసభల కరపత్రాలను విడుదల చేసి మాట్లాడుతూ... నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఈ మహాసభల్లో కార్మిక చట్టాలు ప్రభుత్వ విధానాలపై చర్చించి తీర్మానం చేయడం జరుగుతుందన్నారు. కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గంగన్న గఫూర్ లక్ష్మణ్, భూషణ్ ముత్తన్న ఉన్నారు.

# కార్యదర్శుల నూతన కార్యవర్గం



**సారంగాపూర్, జూన్ 3 (ప్రభాత సమాచారం)**
సారంగాపూర్ మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులందరు కలిసి మంగళవారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా రాజేందర్, సరితలను నియమించారు. జనరల్ సెక్రటరీగా కే.సుధాకర్, క్యాషియారుగా గోపి కృష్ణ, ట్రెజరర్‌గా సీ.ఎచ్ ప్రేమలత, మీడియా కోఆర్డినేటర్‌గా యూ.కృష్ణ మొత్తం ఎనిమిది మంది సభ్యుల పేర్లు తీర్మానించారు.

# టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

**మంచిర్యాల, జూన్ 3 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన ఫస్ట్ లాంగ్వేజ్ పరీక్షకు 167కి 133 మంది హాజరయ్యారు. పరీక్షలు సజావుగా జరిగేందుకు ఏర్పాట్లు చేశారు.

## పాఠశాలలో మౌలిక
# సదుపాయాలు కల్పించాలి



**నిర్మల్, జూన్ 3 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి విద్యార్థులకు అవసరమయ్యే మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మంగళవారం నిర్మల్ రూరల్ మండలంలోని అక్కాపూర్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేసి అక్కడ ఉన్న సౌకర్యాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లు తాగునీటి నల్లాలను పరిశీలించి విద్యార్థులకు ఉపాధ్యాయులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో మరమ్మత్తులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ తాసిల్దార్ సంతోష్ కుమార్ అధికారులు ఉన్నారు.

## యోగాను జీవితంలో
# భాగంగా మార్చుకోవాలి

**ఆదిలాబాద్, జూన్ 3 (ప్రభాత సమాచారం)**
భారతదేశంలో పుట్టిన యోగాను నేడు ప్రపంచ దేశాలు అనుసరిస్తున్నాయని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాలలో భాగంగా మంగళవారం ఆయుష్ ఆధ్వర్యంలో యోగ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రిమ్స్ ఆసుపత్రి నుండి పట్టణ పురవీధుల్లో సాగిన ర్యాలీలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ తో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకుంటే అనేక లాభాలు ఉన్నాయని అన్నారు. యోగా ప్రాధాన్యతపై ప్రజలకు విస్తృత అవగాహనా కల్పించాలని సూచించారు. ఈ ర్యాలీలో బీజేపీ నాయకులు ఆకుల ప్రవీణ్, రత్నాకర్ రెడ్డి, రవి, స్వామి రెడ్డి, ఆయు ష్ సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.






## అభయాంజనేయస్వామి
# ఆలయ ప్రతిష్టాపన వేడుకలు

**మంచిర్యాల, జూన్ 3 (ప్రభాత సమాచారం)**
మండలంలోని నంనూర్ పునరావాసాస కాలనీలో నూతనంగా నిర్మించిన భక్తాంజనేయ స్వామి ఆలయ ప్రారంభోత్సవ వేడుకలు మంగళవారం మొదలయ్యాయి. విగ్రహాలను ఊరేగింపుతో ఆలయ మండపానికి తీసుకొచ్చారు. అభయాంజనేయ, భక్తాంజనేయ, శివపంచాయతీల, నాగేంద్ర, నవగ్రహ, ధ్వజశిఖర ప్రతిష్టాపన మహోత్సవంలో మొదటిరోజు గుడిప్రధాన దాత అయిన ఆన్ కార్ పద్మశ్రీ సత్యనారాయణ దంపతులు కుటుంబ సమేతంగా పాల్గొని పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అచ్చులాపూర్ వేదపాఠశాలకు చెందిన ముద్దు దీరజ్ అవధాని ఆధ్వర్యంలో పది మంది వేదపండితులు పూజలో పాల్గొన్నారు. గ్రామస్తులు విగ్రహాల జలాధివాసంలో పాల్గొన్నా రు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బేర పోచయ్య, ఒడ్డె శ్రీని వాస్, ఒడ్డె బాలరాజు, పెద్దపల్లి స్వామి, కారుకూరి తిరుపతి, ఒడ్డె రాజ మౌళి, తిరుపతి, ఆకిరెడ్డి వెంకటేశ్, గోపులింగయ్య, రాసమల్ల శ్రీనివాస్ గౌడ్‌లు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఐటిఐలో ప్రవేశానికి
# దరఖాస్తుల ఆహ్వానం

**మందమర్రి, జూన్ 3 (ప్రభాత సమాచారం)**



పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటిఐలో అడ్మిషన్లకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు ఐటిఐ ప్రిన్సిపల్ దేవానంద్ తెలిపారు. ఐటిఐలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఐటిఐలో రెండు సంవత్సరాల కోర్సులైన ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్ మెన్ సివిల్, కోర్స్ డీజిల్ మెకానిక్, లతో పాటు అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటిసి)లో రెండు సంవత్సరాల కోర్సులైన అడ్వాన్స్ సీఎన్సి మ్యాచింగ్ టెక్నీషియన్, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్ (మెకానికల్), మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్, సంవత్సరం కోర్సులు ఆర్టిసన్ యూజింగ్ అడ్వాన్స్ టూల్, మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని అర్హులైన పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఈ నెల 2 నుండి 21వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

# భూభారతి సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



**ముథోల్, జూన్ 3 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని భైంసా ఆర్డీవో కోమల్ రెడ్డి అన్నారు. ముథోల్ మండలంలోని చింతకుంటలో తహశీల్దార్ శ్రీలత, రాంటెక్ గ్రామంలో ఆర్ఐ నారాయణ రావు పటేల్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు మంగళవారం ప్రారంభించారు. అయితే రాంటెక్ గ్రామ రెవెన్యూ సదస్సును ఆర్డీవో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడారు. ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేం దుకే గ్రామాలకు రెవెన్యూ అధికారులను రప్పించి తమ సమస్యల పరిష్కారం కోసం ఈ ప్రతిష్టత్మకమైన కార్యక్రమంకు శ్రీకారం చుట్టిందని అన్నారు. పట్టాపాస్ బుక్ లలో తప్పులు దొర్లడం తదితర అంశాల గురించి భూ సమస్యకు సంబంధించిన ప్రతి అంశం గురించి రైతులు నేరుగా ఈ సదస్సులో దరఖాస్తు చేసుకున్నట్లయితే 100% పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. చింతకుంట గ్రామ రెవెన్యూ సదస్సులో 21 దరఖాస్తులు, రాంటెక్ సదస్సులో 46 దరఖాస్తులు వచ్చినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు, గ్రామస్థులు, తదితరులు, పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల నివారణ కోసం
# ముందస్తు చర్యలు తీసుకోవాలి

**వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశంలో మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, జూన్ 3 (ప్రభాత సమాచారం)**

వర్షాకాలం సమీపిస్తున్నందున జిల్లాలో కీటకజనిత వ్యాధులు, అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్లో జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీష్ రాజ్‌తో కలిసి గూగుల్ మీట్ ద్వారా పంచాయతీరాజ్, మున్సిపల్, సంక్షేమం, వెనుకబడిన తరగతులు అభివృద్ధి, షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి, షెడ్యూల్డ్ తెగల అభివృద్ధి శాఖల అధికారులు, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, విద్య, వైద్య శాఖల అధికారులు, వైద్యాధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కీటకజనిత వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికెన్గున్యా ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటిస్తూ జ్వరం బాధితులకు తమ పరిధిలోనే వైద్య సేవలు అందించాలని, రక్త పరీక్ష కిట్లు, మందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. వైద్యులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజలకు వ్యాధులు ప్రబలకుండా పాటించవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి గ్రామంలో ఆశ, ఆరోగ్య కార్యకర్తల ద్వారా ఇంటింటికి తిరిగి ఫ్రైడే-డ్రైడే నిర్వహించేలా చైతన్యపరచాలని, నివాస పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా మున్సిపల్, గ్రామపంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నమోదైన జ్వరం బాధితుల వివరాలను మున్సిపల్, గ్రామ పంచాయతీ అధికారులకు సమాచారం అందించాలని, తక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న హైరిస్క్ ప్రాంతాలలో ఫాగింగ్, ఆయిల్ బాల్స్ పిచికారీ కార్యక్రమాలు చేపట్టాలని, యాంటీ ల్వారాలను నిరోధించేందుకు ఇంటి చుట్టూ, పరిసర ప్రాంతాలలోని నీటి నిల్వలను తొలగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని, త్రాగునీటి వనరులలో క్లోరినేషన్ చేయాలని తెలిపారు. సంక్షేమశాఖల అధికారులు తమ పరిధిలోని వసతి గృహాలలో పరిశుభ్రత చర్యలు చేపట్టాలని, విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పూర్తి చేసేలా దృష్టి సారించాలని తెలిపారు. జిల్లా ఆసుపత్రిలో 20 పడకలతో ప్రత్యేకంగా జ్వరం వార్డును ఏర్పాటు చేయాలని, బెల్లంపల్లి, లక్సెట్టిపేట, చెన్నూర్ సామాజిక ఆసుపత్రులలో సైతం తగు చర్యలు తీసుకోవాలని, వైద్య శిబిరాలలో, వసతిగృహాలలో కాలపరిమితి ముగిసిన మందులను ఉంచకూడదని తెలిపారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రులలో పాము, తేలు, కుక్క కాటు మందులను అందుబాటులో ఉంచాలని, జిల్లాలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్ను ఏర్పాటు చేయాలని, ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి ఆధ్వర్యంలో ఎపిడమిక్ టీమ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జ్వరం కేసులు అధికంగా నమోదవుతున్నందున వార్డుల వారిగా చర్యలు చేపట్టాలని, మున్సిపల్, వైద్య శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి, సామాజిక ఆరోగ్య కేంద్రాల ఆర్.ఎం.ఓ. వివరాలు, మొబైల్ నంబర్లు ఆయా ఆసుపత్రులలో ప్రజలకు తెలిసే విధంగా ప్రదర్శించాలని తెలిపారు. పారిశుద్ధ్యం, వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా పాటించవలసిన జాగ్రత్తలపై మున్సిపాలిటీలు, గ్రామాలలో ప్రజలకు తెలిసే విధంగా టాం-టాం నిర్వహించాలని, ప్రసార, ప్రచార సాధనాల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని, కళాజాత కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. జిల్లాలోని ఆసుపత్రులలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను నిబంధనల ప్రకారం త్వరగా భర్తీ చేసి ప్రజలకు వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య-ఆరోగ్యశాఖ ప్రోగ్రామ్ అధికారులు, సబ్-యూనిట్ అధికారులు, వైద్యాధికారులు, జిల్లా మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



## విద్యార్థినికి ప్రతిభా పురస్కారం

**సారంగాపూర్, జూన్ 3 (ప్రభాత సమాచారం)**

సారంగాపూర్ మండలానికి చెందిన చవాన్ అర్షితకు మంగళవారం మహాత్మా జ్యోతి బాపూలే సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల కార్యదర్శి సైదులు ప్రతిభా పురస్కారాన్ని అందజేశారు. సారంగాపూర్ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో విద్యనభ్యసించిన అర్షిత జిల్లా స్థాయిలో తృతీయ ర్యాంకు 573 సాధించడంతో ప్రతిభా పురస్కారాన్ని అందించారు. ఈ సందర్భంగా హర్షితను పలువురు అభినందించారు.

## రైతులకు విత్తనాలు పంపిణీ

**వేమనపల్లి, జూన్ 3 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వేమనపల్లి మండలం కేంద్రంలోని రైతు వీధులకు మంగళవారం రైతులకు నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ జెడ్పిటిసి సంతోష్ కుమార్ హాజరై పంపిణీ చేశారు. వ్యవసాయ శాస్త్రవేత్త నాగారాజు, ఆధికారి వీరన్న పాల్గొన్నారు.



## ఐటిఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం



**జన్నారం, జూన్ 3 (ప్రభాత సమాచారం)**

ఐటీఐ, ఏటీసీ, తదితర శిక్షణ కేంద్రాల్లో ఉన్న కోర్సుల్లో ప్రవేశానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జన్నారం ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ బండి రాములు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కేంద్రాల్లో అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్ విడుదల అయిందన్నారు. 14 సంవత్సరాలు నిండిన పదవ తరగతి చదివి అర్హత కలిగిన విద్యార్థులు ఆన్లైన్లో ధ్రువీకరణపత్రాల కాపీలను వెబ్సైట్లో అప్లై చేయాలన్నారు. జూన్ 21 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంజనీరింగ్ నాన్ ఇంజనీరింగ్ లలో శిక్షణ పొందుటకు అవకాశం ఉంటుందన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# బడిబాట ద్వారా విద్యార్థుల నమోదు పెంచాలి



## ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

**ఉట్నూర్, జూన్ 3 (ప్రభాత సమాచారం)**

వందశాతం గిరిజన విద్యార్థుల నమోదు లక్ష్యంగా ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా సూచించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని డీడీలు, డీటీడీవోలు, ఏటీడీవో, పీఎంఆర్సీ సిబ్బందితో ఐటీడీఏ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ప్రాథమిక, ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల పరిధిలోని గిరిజన గ్రామాల్లో సభలు నిర్వహించి విద్యార్థులను బడిలో చేర్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ద్వారా అందిస్తున్న సదుపాయాలు, విద్యా బోధన తీరును వివరించాలన్నారు. ప్రతీ గిరిజన గ్రామానికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించాలని, డివిజన్ల వారీగా ఏటీడీవోల ఆధ్వర్యంలో కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు రోజు వారి కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.




## కొత్త కార్యదర్శుల నియామకం

**నిర్మల్, జూన్ 3 (ప్రభాత సమాచారం)**

జాతీయ మానవ హక్కుల సహాయ సంఘం నిర్మల్ జిల్లా ఛైర్మన్ బి.శ్రీనివాస్ అధ్యక్షతన నూతన కార్యదర్శులను మంగళవారం నియమించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర వైస్ చైర్మన్ సయ్యద్ హైదర్ హాజరు కావడం జరిగింది. యస్. రాజుని (అడ్వకేట్) నిర్మల్ జిల్లా లీగల్ అడ్వైజర్‌గా నియామకపత్రం అందజేయడం జరిగింది, సాజిద్‌ను వైస్ ప్రెసిడెంట్‌గా నియామకపత్రాన్ని అందజేయడం జరిగింది. మిగితా సభ్యులకు కూడా నియామక పత్రాలను అందజేసి వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ మానవ హక్కుల సహాయ సంఘం నిర్మల్ జిల్లా ఛైర్మన్ నూతనంగా నియామకమైన సభ్యులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సహా చట్టం పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షులు వినోద్, వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ సాధిక్, అఫ్రోజ్ పాల్గొన్నారు.

## గల్ఫ్ బాధితునికి ఆర్థిక సాయం

**జన్నారం, జూన్ 3 (ప్రభాత సమాచారం)**

గాంధీనగర్‌కు చెందిన గల్ఫ్ కార్మికుడు గుండారం రాజేష్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న జన్నారం గల్ఫ్ సంక్షేమ సమితి సభ్యులు, అతనికి చికిత్స అందించడం కోసం జన్నారం గల్ఫ్ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో మంగళవారం రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో రమేష్ గౌడ్, ఎల్లయ్య, మద్రిపెల్లి అంజయ్య, శేఖర్ సింహరాజు, మ్యాకల శేఖర్, హైమద్ పాషా ఎరుకల అంజగౌడ్ తవక్కల్ కలీమ్ జునుగురు లక్ష్మణ్ సింహారాజు కిరణ్ బట్టల రాకేష్ గౌడ్ కుమ్మరి రాజు జంగిలి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



# సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలి

**పెంచికల్‌పేట్, జూన్ 3 (ప్రభాత సమాచారం)**

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా, పంచాయతీ అధికారి భిక్షపతి సూచించారు. మంగళవారం పెంచికల్‌పేట్ జెడ్పీఎస్ఎస్ ఆవరణలో ఎంపీడీవో అధ్యక్షతన సీజనల్ వ్యాధుల నివారణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాగునీ టి సరఫరా, పారిశుధ్యం, సీజనల్ వ్యాధుల నివారణ తదితర అంశాలపై చర్చించారు. ఓవర్ హెడ్ ట్యాంకుల శుభ్రత, బ్లీచింగ్ పౌడ ర్ వాడకం, నీటి లీకేజీల నివారణకు మార్గదర్శకాలు జారీ చేశారు. డ్రెయినేజీల్లో పూడికతీత, దోమల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ప్రతీ మంగళ, శుక్రవారాల్లో 'డ్రై డే' పాటించాలని, బడిబాటను విజయవంతం చేయాలని సూచించారు. మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్, తహసీల్దార్ పుష్పలత, ఐసీడీఎస్ సూపర్వైజర్ హసీనా, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అర్షిన్ పాల్గొన్నారు.



### పరస్పర విమర్శలతో

## 'హస్తం'లో గందరగోళం

**మంచిర్యాల, జూన్ 3 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా చెన్నూర్ కాంగ్రెస్‌లో గ్రూపు రాజకీయాలు ముదిరాయి. ఇన్నాళ్లుగా లోపలే పరిమితమై ఉన్న విభేధాలు ఇప్పుడు బహిరంగంగా ప్రద ర్శనకు దిగాయి. ఒకరిపై మరొకరు విమర్శలు చేసుకోవడంతో బహిర్గతమ య్యాయి. చెన్నూర్ నియోజకవర్గంలో ఇటీవల జరిగిన సంస్థత గత సమేశాల సందర్భంగా వెలుగులోకి వచ్చిన తాజా సంఘటనలు, పార్టీ అంతర్గత సమస్యలు ప్రతి బింబిస్తున్నాయి. కొద్ది రోజుల నుంచి ఎమ్మెల్యే వివేక్ వెంకట స్వామి అనుకూలంగా ఉన్న ఒక వర్గం, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి నేతృత్వంలోని మరోవర్గం గ్రూపు రాజకీయాలు చేస్తున్నారు. ఇటీవల చెన్నూర్‌కు పార్టీ పరిశీలకుడు వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యే వివేక్ వెంకట స్వామిపై మూల రాజిరెడ్డి చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో రాజిరెడ్డి మాటలు వివాదస్పదం కావడంతో, అప్పట్లో ఎమ్మె ల్యే వివేక్‌కు అనుకూలంగా ఉన్న కొందరు కాంగ్రెస్ నాయకులు వేర్వేరుగా సమావేశాలు నిర్వహించి మూల రాజిరెడ్డిపై విమర్శలు చేశారు. అయితే దానికి కౌంటర్‌గా మూల రాజిరెడ్డి తన వర్గానికి చెందిన నాయకులతో మం గళవారం చెన్నూర్‌లో అంతర్గత సమావేశం నిర్వహించారు. అనంతరం రాజి రెడ్డి తరపున తన వర్గం నాయకులు పోగుల సతీశ్, ముత్యాల రవికుమార్, స్వామి, స్వరూప్‌సింగ్ చెన్నూర్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లా డారు. గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా వివేక్ వెంకటస్వామి, ఎంపీగా వంశీకృష్ణ గెలుపు కోసం కృషి చేసిన మూల రాజిరెడ్డిపై విమర్శలు చేయడం వారికి తగదని హెచ్చరించారు. ఇలా పరస్పర విమర్శలపై ఈ గ్రూపు రాజకీయాలు ఎక్కడికి దారి తీస్తాయోనని ప్రజలు చర్చించుకుంటున్నారు.



# పాటకు మరణం లేదు!



గాంధర్వ లోకాల నుంచి భూలోకానికి దిగి వచ్చిన పాటల పూదోట. ఆ తోటలో విరబూసిన పసిడి పంట ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం. ఆయన గొంతు విప్పితే అమ్మ జోల పాడినట్లుగా పసిపాప కూడా హాయిగా నిద్రలోకి జారుకోవాల్సిందే అంత అద్భుతమైన గాత్రంతో ప్రేక్షకులకు పసందైన వీనుల విందునందించారు. ఆయన స్వరం అద్భుతం, ప్రభంజనం అనన్య సామాన్యం. ఆయన పాట వింటే గాయపడిన హృదయాలు సైతం ప్రశాంతంగా తన్మయత్వంలో మునిగిపోవాల్సిందనడంలో అతిశయోక్తి లేదు. విభిన్న స్వరాలతో పాటలు పాడుతూ తన గాత్ర ప్రతిభతో శ్రోతలను మంత్రముగ్ధులను చేశాయి. బాలు గారి గొంతులో పలుకని తెలుగు పదం లేదు. పాడనీ రాగం లేదు. సంగీత శాస్త్రాన్ని అధ్యయనం చేసిన ఘనుడు గానగంధర్వుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం.



బాలు గారి పాట తరగని మాధుర్యం. ఆహ్లాదకరమైన శ్రావ్యత, ఆ స్వరంలో స్పష్టత నిజానికి బాలు గారి స్వరం దేవుడు ఇచ్చిన గొప్ప వరం. సన్నివేశానికి అనుగుణంగా ఎమోషనల్ గా, సహజంగా పాటకు ప్రాణం పోయడంలో బాలసుబ్రహ్మణ్యంను మించిన వారు లేరనే చెప్పాలి. దైవభక్తి, దేశ భక్తి గేయాలు, బృందగీతాలు, ప్రణయ, విరహ, శృంగార, కరుణామయ, జానపద గీతాలు, అనేకము సం దార్భాను సారముగా రాగయుక్తముగా భావ యుతముగా వైవిధ్యభరితమైన వేల పాటలు పాడి తెలుగు వారి మదిలో శాశ్వత స్థానాన్ని పొందిన అమర గాయకుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం. ఐదు దశాబ్దాల పాటు సాగిన ప్రస్థానంలో తెలుగు పాటలే కాకుండా తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో తిరుగులేని గాయకుడిగా, సంగీత దర్శకుడిగా, 16 భాషల్లో 50,000కు పైగా అత్య ధిక సంఖ్యలో గీతాలను ఆలపించిన గాయకుడు గా గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించాడు. ఆయన ఆలపించిన గీతాలు, ఆయన చేసిన కృషికి ఆరు జాతీయ చలనచిత్ర అవార్డులు, 25 తెలుగు సి నిమాలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నంది అవార్డులు, కర్ణాటక, తమిళనాడు ప్ర భుత్వం నుంచి అనేక ఇతర రాష్ట్ర అవా ర్డులు అంతేకా కుండా ఆరు ఫిలింఫేర్ అవార్డ్స్ సౌత్, ఎ ఫిల్మ్ ఫేర్ అవార్డు అందు కోవడం గొప్ప విషయం. తెలుగు రాష్ట్రాల ప్రజలు గర్వించదగిన విషయం. 1981 ఫిబ్రవరి 8న కన్నడలో 24 గంటల సమయంలో ఎలాంటి విరామం తీసుకోకుండా ఏకంగా 27 పాటలు ఆలపించి సరికొత్త రికార్డు సృష్టించారు. కన్నడంలో కాకుండా తమిళంలో 19 పాటలు, హిందీలో 16 పాటలు రికార్డు చేసి రికార్డు సృష్టించారు.

### వాయిస్ ఓవర్ కూడా..

**కమల్ హాసన్, రజనీకాంత్, విష్ణువర్ధన్, సల్మాన్ ఖాన్, కె.భాగ్యరాజ్, మోహన్, అనిల్ కపూర్, గిరీష్ కర్నాడ్, జెమినీ గణేశన్, అర్జున్ సర్జా, నగేష్, కార్తీక్, సహా పలు కళాకారులకు బాలు వాయిస్ ఓవర్ కూడా అందించారు.**

**కుటుంబ నేపథ్యం..**

ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా లోని కోనేటమ్మపేట గ్రామంలో తెలుగు బ్రాహ్మణ కుటుంబానికి చెందిన హరికథా కళాకారుడు శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి, శకుంతలమ్మ దంపతులకు 1946 జూన్ 4 న జన్మించారు. ఆయన తండ్రి హరికథా కళాకారుడు అవడంవల్ల బాల సుబ్రహ్మణ్యానికి సంగీతంపై ఆసక్తి కలిగింది. తన తండ్రికి కూడా సంగీత కళాకారుడు కావాలనే కోరిక బలంగా ఉండేది. బాలసుబ్రహ్మణ్యం చిన్న తనంలోనే సంగీత సంజ్ఞామానాలను అభ్యసించి, తన స్వయం కృషితో సంగీతం నేర్చుకున్నారు. చిన్నతనం నుంచే పాటల పోటీలో పాల్గొని ఎన్నో అవార్డులు గెలుచుకున్నారు. ఇంజినీర్ కావాలనే ఉద్దేశంతో అనంతపురం జేఎన్‌టీయూ ఇంజి నీరింగ్ కాలేజీలో చేరాడు. బాలుకి మొదటగా సంగీత కళాకారుడిగా కాకుండా తన తండ్రి ఆశయం మేరకు ఇంజినీరింగ్ చదివి ప్రభుత్వ ఉద్యోగం చేయాలనే కోరిక ఉండేది. కానీ ఇంజినీ రింగ్ చదివే సమయంలో అనారోగ్య కారణంగా మధ్యలోనే చదువు మానేశాడు. ఆ తర్వాత గాయ కుడిగా రాణించడానికి నిర్విరామ కృషి చేశారు.

**హిందీలోనూ మంచి గుర్తింపు..**

1989లో సల్మాన్ ఖాన్ నటించిన హిందీ చిత్రం 'మైనే ప్యార్ కియా'లో దిల్ దీవానా పాటకు బాలు ఉత్తమ నేపథ్య గాయకుడిగా ఫిల్మ్‌ఫేర్ అవార్డును గెలుచుకున్నారు. ఆ తర్వాత సల్మాన్ ఖాన్ నటించిన చాలా చిత్రాలలో ప్లేబాక్ సింగర్ గా పని చేశారు. బాలు, లతా మంగేష్కర్ కలిసి పాడిన హిందీ చిత్రం 'ఆప్కే హై కౌన్'లోని 'దీదీ తేరా దేవర్ దీవానా' పాట అత్యంత ప్రజాధా రణ పొందడమే గాక హిందీ చలన చిత్రంలో తనకంటూ మంచి గుర్తింపు లభించింది.

**సాధించిన అవార్డులు:**

- 2001లో భారత ప్రభుత్వం నుంచి అత్యున్నత మైన పద్మశ్రీ అవార్డు.
- 2012లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఎన్టీ ఆర్ జాతీయ అవార్డు.
- 2015లో కేరళ ప్రభుత్వం నుంచి హరివరాస నం అవార్డు.
- 2016లో 47వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా ఇండియన్ ఫిల్మ్ పర్సనాలిటీ ఆఫ్ ది ఇయర్ అవార్డు తో సత్కరించబడ్డాడు.
- అత్యంత బాధాకరమైన విషయం ఏమిటంటే 2020 సెప్టెంబర్ 25న అందుకోవాల్సిన పద్మ విభూషణ్ అవార్డు కొవిడ్-19 కారణంగా ఆలస్యమవడం, కొవిడ్ కారణంగా ఆయన 2020 సెప్టెంబర్ 25న మరణించడం బాధాకరం. ఆయన మరణానంతరం 2021 పద్మ విభూషణ్ అవార్డు ప్రదానం చేశారు.

### పాటకు ప్రాణం..

ఎందరో నటీనటులకు వారి హావభావా లకు, అభినయ రీతులకు అనుగుణంగా పాటలకు ప్రాణం పోశారు. అందుకే అమర గాయకుడు ఘంటసాల తర్వాత తెలుగు సినిమా పాటకు అసలైన వారసుడయ్యాడు. పదాల సరళిని జాగ్రత్తగా గమనిస్తూ అతడి విరామ చిహ్నాలు అతడి పాటను పండితుల కు దగ్గర చేశాయి. శ్రోతలను మంత్రముగ్ధుల ను చేశాయి. మనిషికి మరణం కానీ, పాటకు మరణం లేదనడంలో అతిశయోక్తి లేదు. భౌతికంగా మాత్రమే లేరు. ఆయన రాసిన , పాడిన పాటల్లో సజీవంగా నిలిచాయి. చరిత్రలో నిలిచిపోయారు. బాలు గారి పాట చిరస్మరణీయం.

### సినీరంగ ప్రవేశం..

**ఎస్పీ కోదండపాణి స్వర పరిచిన తెలుగు సినిమా శ్రీ శ్రీ శ్రీ మర్యాద రామన్నలోని 'ఏమియే వింత మోహం' పాటతో ప్లేబ్యాక్ సింగర్‌గా 1966 డిసెంబర్ 15న అరంగేట్రం చేశారు. ఆ తర్వాత 1968 లో కోదండపాణి స్వరపరిచిన సుఖదుఃఖాలు చిత్రంలో 'మేడంటే మేడ కాదు' పాట తెలుగు చిత్రసీమలో ఆయనకు గుర్తింపు తెచ్చిపెట్టింది. తెలుగు చిత్ర పరిశ్రమ నుంచి ఇప్పటివరకు వచ్చిన అత్యుత్తమ చిత్రాలలో ఒకటిగా పరిగణించబడుతున్న శంకరాభరణం 1980 లో కె.విశ్వనాథ్ దర్శకత్వంలో విడుదలైన సంగీత ప్రాధాన్యత గల చిత్రం బాలసుబ్రహ్మణ్యం గారికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఆయన కృషికి ఉత్తమ నేపథ్య గాయకుడిగా జాతీయ అవార్డుతో సత్కరించింది. ఆ తర్వాత సంవత్సరం 1981 లో 'ఏక్ దుయుజే కే లియే' హిందీ చిత్రానికి మరో జాతీయ అవార్డు లభించింది. ఆయన గాత్రం అందించిన ఉత్తమ చిత్రాలు స్వాతిముత్యం, సాగర సంగమం, రుద్రవీణ, మాతృదేవోభవ, కే విశ్వనాథ్ నిర్మించిన చిత్రాలన్నీకూడా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాడినవే, అగ్ర హీరోల సినిమాలకు ఎక్కువ బాలు పాడినవే.**




- ప్లాస్టిక్ కట్టడి ఎలా...?
- విచ్చల విడిగా కవర్లు, వస్తువులు వినియోగం
- నియంత్రించడంలో మున్సిపాలిటీల నిర్లక్ష్యం
- వ్యాపారులకు అవగాహన కల్పించే యోచన
- మారకుంటే నేరుగా చర్యలకు శ్రీకారం
- గతంలో తనిఖీ అధికారులపై దాడుల సంఘటనలు

**(ప్రభాత సమాచారం, మంచిర్యాల ప్రతినిధి)**

మంచిర్యాల నగరంతోపాటు జిల్లాలోని లక్షెట్టిపేట, క్యాతన్‌పల్లి, మందమర్రి, చెన్నూరు, బెల్లంపల్లి మున్సిపాలిటీల్లో పెద్ద ఎత్తున ప్లాస్టిక్ వినియోగం జరుగుతోంది. ప్లాస్టిక్ కవర్లు, వస్తువులను వ్యాపారులు విచ్చ లవిడిగా విక్రయిస్తుండగా, వినియోగదారులు సైతం వాటిని విరివిగా వాడుతున్నారు. మంచిర్యాల నగర పాలక సంస్థ పరిధిలో ప్రతీ రోజు చెత్త సేకరణలో సగానికంటే ఎక్కువ ప్లాస్టిక్ వస్తువులే లభిస్తున్నాయి. ప్లాస్టిక్ వాడకం ద్వారా అనేక ఆరోగ్యపరమైన సమస్యలు వస్తున్నాయని ప్రజలకు తెలినప్పటికీ అనివా ర్యంగా ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్‌తో తయారు చేసిన వస్తువులను వాడుతున్నారు. తద్వారా ప్రజలు క్యాన్సర్‌తో పాటు పలు దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడాల్సి వస్తోంది.

**నిబంధనలకు విరుద్ధంగా...**

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మంచిర్యాల, నస్పూర్, శ్రీరాంపూర్‌లలో పదుల సంఖ్యలో హోల్ సేల్ ప్లాస్టిక్ విక్రయషాపులు ఉన్నాయి. వాటి నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం 120 మైక్రాన్ల మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లను మాత్రమే విక్రయించాలి. కానీ కొందరు వ్యాపారులు 120 మైక్రాన్ల మందం ఉన్నట్లు నకిలీ ముద్రను వేసి మరీ కవర్లు యథేచ్ఛగా విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మరి కొందరు బల్దియా సిబ్బంది, రాజకీయ నేతల అండదండలతో ప్లాస్టిక్ విక్రయాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇలా ప్రతీ రోజు మంచిర్యాల నగరం నుంచి దాదాపు వంద టన్నుల ప్లాస్టిక్ విక్రయాలు జరుగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు విమర్శలు వస్తున్నాయి.

**పట్టించుకోని అధికారులు....**

మంచిర్యాల నగరంలోని మార్కెట్ రోడ్, స్టేషన్ రోడ్, శ్రీనివాస టాకీస్ రోడ్డులో ఉన్న హోల్‌సేల్ షా పులలో పెద్దమొత్తంలో ప్లాస్టిక్ విక్రయాలు జరుగుతున్నాయి. ఇక్కడి నుంచి గ్రామీణ ప్రాంతాలతో పాటు బార్లు, రెస్టారెంట్లు, మటన్ షాపులు, చికెన్ షాపులు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, కూరగాయల విక్రయ వ్యాపారులకు, కిరాణ షాపులకు సప్లయి అవుతున్నాయి. అడ్డగోలుగా ప్లాస్టిక్ దందా జరుగుతున్నా ఏ అధికారి కన్నెత్తి చూడక పోవడంపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కొంతమంది బల్దియా సిబ్బంది ఆయా హోల్‌సేల్ దుకాణాల్లో మామూళ్లు వసూలు చేస్తున్నారన్న అభియోగాలు సైతం ఉన్నాయి. సింగిల్ యూజ్ బ్యాగులు వాడాలని సిబ్బంది అవగాహన కల్పించకపోవడంతో ప్లాస్టిక్ వాడకం విచ్చలవిడిగా మారింది. గతంలో జిల్లా వ్యాప్తంగా ప్లాస్టిక్ నిశేధం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టేవారు. దుకాణాలలో ముమ్మర తనిఖీలు నిర్వహిస్తూ, భారీగా ఫైన్‌లు వేయడం ద్వారా ప్లాస్టిక్ వాడకంపై ఉక్కుపాదం మోపేవారు. దీంతో అపట్లో కొంత మేరకు నియంత్రణ జరిగింది. అయితే అప్పటి అధికారులు, సిబ్బందికి బదిలీలు కావడంతో తనిఖీలు నిలిచిపోయాయి. దీంతో పరిస్థితి ఎప్పటిలాగే తయారైంది.

**సానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై వ్యాపారి దాడి..**

ప్లాస్టిక్ తనిఖీల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని ఓ హోల్‌సేల్ షాపునకు వెళ్లిన మున్సిపల్ అధికారిపై 2020 డిసెంబరు 7న చోటు చేసుకుంది. స్వచ్ఛ సర్వేక్షన్-2021లో భాగంగా స్థానిక శ్రీనివాస టాకీస్ రోడ్డు లోగల ఓ ప్లాస్టిక్ షాపులో అప్పటి సానిటర్ ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్, జవాను కుంటాల రాజలింగుల నేతృత్వంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పెద్ద మొత్తంలో ప్లాస్టిక్ గ్లాసులు, కవర్లు లభించడంతో కూపీ లాగిన సిబ్బంది షాపు వెనకాల ఉన్న మరో బిల్డింగులో మరింత స్టాకు ఉందని తెలుసుకున్నారు. దీంతో వారు అక్కడికి వెళ్లగాషాపు యజమాని సిబ్బందిని దుర్భాషలాడుతూ సానిటరీ ఇన్ స్పెక్టర్‌తో పాటు జవానుపై భౌతికదాడికి పాల్పడ్డాడు. అంతటితో ఆగకుండా వ్యాపారి బూతులు తిడుతూ ఇద్దరిపై మళ్లీ దాడికి యత్నించాడు. దీంతో వెను దిరిగి నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి దాడికి పాల్పడ్డ వ్యాపారిపై ఫిర్యాదు చేశారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

**అమ్మ ఆదర్శ కమిటీలు చొరవ తీసుకోవాలి - ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ఆదిలాబాద్, జూన్ 3 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా అమ్మ ఆదర్శ కమిటీలు చొరవ తీసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో బడిబాట నిర్వహణపై విద్యాశాఖ అధికారులతో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జూన్ 12 నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్నందున తరగతి గదులు, టాయిలెట్స్, కిచెన్స్ శుభ్రపర్చాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈవో జితేందర్రెడ్డి, డీఈవో శ్రీనివాసరెడ్డి, డీఆర్డీవో రాథో డ్ రవీందర్, ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.





# మెడికల్ కాలేజీ నియామకాల్లో అక్రమాలు?

**ఆసిఫాబాద్, జూన్ 3 (ప్రభాత సమాచారం)**

ఆసిఫాబాద్ మెడికల్ కాలేజిలో అక్రమ నియమాలు నిర్వహిస్తున్నారని అభ్యర్థులు, ప్రజాసంఘాల నాయకులు ఆరోపించారు. ఆసిఫాబాద్ మెడికల్ కాలేజీలో ఖాళీ ఉన్న వివిధ పోస్టుల భర్తీకి ఇటీవల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించిన అధికారులు మంగళవారం అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేపట్టారు. దరఖాస్తులు చేసిన అభ్యర్థులందరికి సమాచారం ఇవ్వాల్సి ఉండగా... అందులో కొందరికి మాత్రమే ఫోన్ చేసి సర్టిఫికెట్ వెరిఫికేషన్ కు పిలిచారని అభ్యర్థులు ఆరో పించారు. డబ్బులు ఇచ్చి అభ్యర్థులను అధికారులు ఎంపిక చేశారని ప్రజాసంఘాల నాయకులు దిన్కార్, కార్తీక్ ఆరోపించారు. ఆయాపోస్టుల దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ పారదర్శకంగా చేపట్టి అర్హులైన వారికీ న్యాయం చేయాలన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచాలి : డీఈవో రామారావు



**నిర్మల్, జూన్ 3 (ప్రభాత సమాచారం)**

వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పెంచాలని డీఈవో రామారావు సూచించారు. డీఈవో కార్యాలయంలో విద్యాశాఖ అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. పాఠశాలల ప్రారంభం నాటికి బడులన్నిటినీ శుభ్రపరచి రెడీ చేయాలన్నారు. ఈనెల 6 నుంచి 19 వరకు బడిబాట కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఇందులో ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించే వసతులు, సౌకర్యాలను వివరించాలని సూచించారు. ఇందులో అధికారులు రమణారెడ్డి, సమన్వయకర్తలు రాజేశ్వర్, నరసయ్య, ప్రవీణ్ కుమార్, సలోమి కరుణ, శ్రావణి, మహేశ్వర్, కృష్ణవేణి, ఎంఈవోలు, తదితరులు పాల్గొన్నారు.

# భూభారతితో సమస్యలు పరిష్కారం






## ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఇచ్చోడ, జూన్ 3 (ప్రభాత సమాచారం)**

భూభారతితో భూ సమస్యలు తర్వితగతిన పరిష్కారమవుతాయని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మండలంలోని అరెపల్లిలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సును సందర్శించారు. ప్రతీ ఒక్కరికి తమ భూమిపై హక్కు చట్టబద్ధంగా, స్పష్టంగా ఉండేలా భూ భారతి కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా స్థానికుల నుంచి వచ్చిన దరఖాస్తుల ను పరిశీలించారు. ప్రజలు భూరికార్డులపై పూర్తి సమాచారం కలిగి ఉండటం ద్వారా భవిష్యత్తులో సమస్యలకు తావు లేకుండా ఉంటుందని సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, అధికారులున్నారు.

**అడేగామ(కే)లో..**

మండలంలోని అడేగామ (కే)లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు కలెక్టర్ రాజర్షి షా హాజరై పలు రికార్డులను పరిశీలించారు. అలాగే గ్రామస్తులతో మాట్లాడారు. భూభారతి చట్టం అమలులో భాగంగా ప్రభుత్వం గ్రామాల్లో సదస్సులు నిర్వహించి భూ సమస్యలు ఎక్కడికక్కడే పరిష్కరించేలా కృషి చేస్తుందన్నారు. ఇటువంటి పొరపాట్లకు తావివ్వకుండా దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని సిబ్బందికి ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ రావు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.






## నీటి సమస్య తలెత్తకుండా చర్యలు

**ఆదిలాబాద్, జూన్ 3 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్లో నీటి ఎద్దడి లేకుండా ఇప్పటికే 8 నీటి ట్యాంకులను అమృత్ పథకం కింద మంజూరు చేసుకోవడం జరిగిందని తెలిపారు. దాదాపు 5 ట్యాంకు నిర్మాణ పనులు వివిధ దశలో జరుగుతున్నాయని పేర్కొన్నారు. బంగారిగూడలో ఆరు లక్షల నీటి సామర్థ్యంతోసామర్థ్యంతో ట్యాంక్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. బంగారిగూడలో నెల కొన్న నీటి సమస్య పరిష్కారం అవుతుందన్నారు. అదే విధంగా పైప్లైన్ నిర్మాణ పనుల సైతం పూర్తి చేస్తామన్నారు.

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



**కాసిపేట, జూన్ 3 (ప్రభాత సమాచారం)**

రైతులకు అండగా నిలబడడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ పేర్కొన్నారు. కాసిపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం అనే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాసిపేట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, వ్యవసాయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పారిపెల్లిలో బస్ పాస్ మేళా



**లక్ష్మణచాంద, జూన్ 3 (ప్రభాత సమాచారం)**

లక్ష్మణచాంద మండలం పారిపెల్లి గ్రామములో నిర్మల్ డిపో మేనేజర్ కే పండరి ఆదేశానుసారం బస్ పాస్ మేలా మంగళవారం నిర్వహించారు. అర్హులయిన 20 మంది దివ్యాంగులకు ప్రయాణములో 50% రాయితీతో కూడిన బస్ పాసులను అందచేశారు. ఈ బస్ పాస్ డీలక్స్, ఎక్స్ ప్రెస్, పల్లెవెలుగు బస్సులలో ప్రయాణంలో 50% రాయితీతో ప్రయాణించవచ్చని ఇంకా గ్రామంలో దివ్యాంగులు బస్ పాస్లు లేని వారు సదరం సర్టిఫికెట్ జిరాక్స్, ఆధార్ కార్డ్ జిరాక్స్ ఒక ఫొటో 50/-రూ.తీసుకొని వచ్చి పాస్ పొందాలన్నారు.

## భూ సమస్యలకు పరిష్కారానికే భూభారతి

**తాండూర్, జూన్ 3 (ప్రభాత సమాచారం)**

భూ సమస్యల పరిష్కారం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి స్థానంలో భూభారతి నూతన చట్టాన్ని పగ డ్బందీగా తీసుకు వచ్చిందని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి అన్నారు. మండలంలోని పెగడపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రజలు, రైతులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ఆర్డీవో హరి కృష్ణ, తహసిల్దార్ జ్యోత్స్న, ఎంపీడీవో శ్రీనివాస్, గిర్దావర్ ఎజాజుద్దీన్ పాల్గొన్నారు.



## అనుమతి లేని డ్రోన్లపై నిషేదం

**మంచిర్యాల, జూన్ 3 (ప్రభాత సమాచారం)**

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోలోని మంచిర్యాల జిల్లాలో అనుమతి లేని డ్రోన్లపై నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నట్లు రామగుండం సిపి అంబర్ కిషోర్ జూ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యంపై నిషేదాజ్ఞలు కొనసాగిస్తున్నట్లు ప్రకటించారు. ఈనెల ఒకటి నుంచి వచ్చేనెల ఒకటి వరకు పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. పోలీస్ ఆజ్ఞలను ఎవరైనా అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## విత్తనాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**ముథోల్, జూన్ 3 (ప్రభాత సమాచారం)**

వానకాల సీజన్లో రైతులకు అవసరమయ్యే విత్తనాలను మంగళవారం ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ పంపిణీ చేశారు. స్థానిక విశ్రాంతిభవనంలో విత్తనం రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా రైతులకు పచ్చిరొట్ట విత్తనాలతో పాటు వివిధ పంటల విత్తనాలను అందించారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అందుబాటులో పంటలపై అవగాహన కల్పించాలన్నారు.

## భార్య మృతికి కారణమైన భర్త అరెస్ట్

**ఆదిలాబాద్, జూన్ 3 (ప్రభాత సమాచారం)**

గత నెల30న బంగారిగూడలో సేపూర్వార్ ప్రవళిక అనే వివాహిత ఐదు నెలల గర్భవతికి బలవంతంగా గర్భస్రావం కోసం మాత్రలు వేయించి తన చావుకు కారణమైన భర్త సేపూర్వార్ ప్రశాంత్ను అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి సోదరుడు వెలిశాల రాజేష్ ఫిర్యాదు ఇవ్వగా అతని పై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. కేసులో సేపూర్వార్ ప్రశాంత్ను మంగళశారం అదిలాబాద్ రూరల్ ఎస్సై విష్ణువర్ధన్ అరెస్టు చేసి రిమాండ్కు తరలించారు. మృతురాలికి అప్పటికే 19 నెలల బాబు ఉండడంతో వారి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే ఉండడంతో రెండవ సంతానం వద్దనుకొని మాత్రలు ఇవ్వడం జరిగిందని, వచ్చిన వార్తలలో ఎలాంటి వాస్తవం లేదని, తమన విచారణలో వెల్లడైనట్లు తెలిపారు.

# ఉఫ్.. హాట్ ఫోజులతో సోషల్ మీడియాను హీటెక్కిస్తున్న దిశా!

హాట్ బ్యూటీ దిశా పటానీ మరో గ్లామరస్ ఫొటో షూట్ తో రెచ్చిపోయింది. బ్లూ కలర్ వన్ పీస్ లో దిశా స్టన్నింగ్ లుక్స్ సోషల్ మీడియాను హీటెక్కిస్తున్నాయి. ఈ పిక్స్ పై మీరూ ఓ లుక్కేయండి. దిశా న ఫిట్‌నెస్, డాన్స్ స్టైల్స్‌కి ప్రత్యేకంగా ఫేమస్. ఆమె జిమ్ వీడియోలు తరచూ వైరల్ అవుతూనే ఉంటాయి. సోషల్ మీడియాలో ఫుల్ యాక్టీవ్ గా కనిపించే ఈ బ్యూటీ గ్లామరస్ లుక్స్‌తో నెటిజన్లను ఫిదా చేస్తుంటుంది. తాజాగా బ్లూ కలర్ వన్ పీస్ లో దిశా స్టన్నింగ్ లుక్స్ సోషల్ మీడియాను హీటెక్కిస్తున్నాయి. మోడలింగ్ తో కెరీర్ మొదలు పెట్టిన దిశా "లోఫర్" అనే తెలుగు సినిమాతో నటిగా పరిచయమైంది. బాలీవుడ్‌లో "MS Dhoni: The Untold Story" సినిమాతో ఆమెకి బాగా గుర్తింపు వచ్చింది. దిశా పటానీకి పెంపుడు జంతువులంటే చాలా ఇష్టం. ఆమె కొన్ని క్యూట్ డాగ్స్‌ను పెంచుతుంది. సినిమాలతో పాటు పలు కమర్షియల్ యాడ్స్ కి బ్రాండ్ అంబాసిడర్ గా వ్యవహరించింది ఈ బ్యూటీ



## హరిహర వీరమల్లు రిలీజ్ వాయిదా..?

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హీరోగా తెరకెక్కుతున్న సినిమా హరిహర వీరమల్లుపై మరోసారి సోషల్ మీడియాలో తీవ్ర ప్రచారం జరుగుతోంది. ఈ నెల 12న పాన్ ఇండియా స్థాయిలో సినిమా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం తెలిపింది. తాజాగా ఈ చిత్రం విడుదల మరోసారి వాయిదా పడిందని సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. అయితే దీనికి సిజీ వర్క్ కారణమని తెలిసింది. ఆ పనులు పూర్తి కావడానికి మరి కొంత సమయం పడుతుందట. ఆ కారణంగానే జూన్ 12న విడుదల కావడం లేదని సమాచారం. కానీ తాజాగా నిర్మాత ఎ.ఎం రత్నం టికెట్, ధరలు, ప్రత్యేక షోలకు అనుమతి కోరుతూ ఇటీవల ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు భరత్ భూషణ్‌ను కలిశారు. ఈ నేపథ్యంలో విడుదల విషయంలో అభిమానులు సతమతమవుతున్నారు. ఈ నెల 12న విడుదల ఉందా లేదా అన్నదానిపై క్లారిటీ కోరుతూ సోషల్ మీడియాలో కామెంట్స్ పెడుతున్నారు. 'హరిహర వీరమల్లు' సినిమాకు ఎలాంటి థియేటర్స్ బ్లాక్ చేయ్యెద్దని నిర్మాత ఇప్పటికే చెప్పినట్లు ఇండస్ట్రీలో చర్చ నడుస్తోంది. కొత్త రిలీజ్ డేట్ కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. అయితే జూన్ 20 లేదా జూన్ 27న రిలీజ్ చేయాలని మేకర్స్ పరిశీలిస్తున్నారని మరో టాక్ నడుస్తోంది. అందుకోసం మంచు విష్ణుని జూన్ 27న 'కన్నప్ప' సినిమాను వాయిదా వేసుకోవాలని కోరినట్లు టాక్. అందుకు విష్ణు ఒప్పుకోలేదని గుసగుసలు వినిపిస్తున్నాయి. జూన్ మిస్ అయితే జూలైలో హరిహర వీరమల్లు రావచ్చు. అప్పుడు ఏ సినిమా వెనక్కి తగ్గుతుందో చూడాలి. అయితే ఈ ప్రచారాల్లో ఎంత నిజం ఉందో తెలియాలంటే మేకర్స్ అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



## సారీ చెప్పను, రిలీజ్ చేయను..



నటుడు కమల్ హాసన్ మరో సంచలన ప్రకటన చేశారు. తన రాబోయే తమిళ చిత్రం 'థగ్ లైఫ్' ను కర్ణాటకలో విడుదల చేయడం లేదని వెల్లడించారు. కన్నడ భాషపై తాను తప్పేం మాట్లాడలేదని. క్షమాపణ చెప్పేది లేదని తేల్చి చెప్పారు. అంతకుముందు తన సినిమాకు కన్నడలో ఎలాంటి ఆటకం కలగకుండా ఉండేలా చూడాలంటూ కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. అయితే కోర్టు ఆయనపై అసహనం వ్యక్తం చేసింది. గత నెలలో తన సినిమా ప్రమోషన్ సందర్భంగా కన్నడ భాష తమిళం నుంచి పుట్టిందనిఆయన చేసిన వ్యాఖ్యలు వివాదం సృష్టించిన సంగతి తెలిసిందే. కన్నడ భాషపై తాను చేసిన వ్యాఖ్యలను అక్కడి వారు అపార్థం చేసుకోవడం తనకు ఎంతో బాధగా ఉందన్నారు కమల్ హాసన్ తమిళ్, కన్నడ ప్రజలు ఒకే ఫ్యామిలీ అని చెప్పడమే తన ఉద్దేశమని చెప్పుకొచ్చారు. కన్నడ భాషను తక్కువ చేయడం కాదని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (కేఎఫ్‌సీసీ)కి లేఖ రాశారు. తన వలన శివన్న ఇబ్బందిపడడం విచారకరమని తెలిపారు. రాజ్‌కుమార్ కుటుంబంతో ఉన్న అనుబంధం ఎంతో గొప్పదని వెల్లడించారు.




ప్రభాస్ ఫ్యాన్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న 'ది రాజా సాబ్' మూవీ విడుదల తేదీని ప్రకటించారు మేకర్స్. డిసెంబర్ 5న విడుదల కానున్నట్లు తెలియజేస్తూ ఎక్స్ లో పోస్టర్ షేర్ చేశారు. తెలుగుతో పాటు హిందీ, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో కూడా విడుదల కానుంది. ఇది మాత్రమే కాదు ఈనెల 16న మూవీ టీజర్ ను విడుదల చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. కామెడీ హర్రర్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రంలో ప్రభాస్ ద్విపాత్రాభినయం చేస్తున్నారని టాక్. ఈ సినిమాతో డార్లింగ్ మొదటి సారి హారర్ జానర్ లోకి అడుగుపెడుతున్నారు. అంతేకాదు ఇది ప్రభాస్ కెరీర్‌లో పూర్తిస్థాయి హారర్ ఎంటర్‌టైనర్‌గా నిలవనుంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై డైరెక్టర్ మారుతీ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఎస్. ఎస్ థమన్ సంగీతం అందిస్తున్నారు. 'కల్కి 2898 AD' లాంటి బ్లాక్ బస్టర్ తర్వాత ప్రభాస్ నుంచి రాబోతున్న 'ది రాజా సాబ్'పై అంచనాలు భారీగా ఉన్నాయి. అయితే ఈ చిత్రంలో లేడీ సూపర్ స్టార్ నయనతార కూడా ఒక స్పెషల్ అప్పియరెన్స్ సాంగ్‌లో మెరవనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఉన్నతమైన నిర్మాణ విలువలతో భారీ స్థాయిలో ఈ మూవీని రూపొందిస్తున్నట్లు సమాచారం. ఇందుకోసం దాదాపు ₹300–350 కోట్లుగా ఖర్చు చేస్తున్నట్లు టాక్.

MOVIE TIME
బుధవారం | 4 జూన్ | 2025



## రెండు ద్విచక్ర వాహనాలు దగ్ధం

**ఆదిలాబాద్, జూన్ 3 (ప్రభాత సమాచారం)**

పట్టణంలోని శివాజీచౌక్‌లో ప్రమాదవశాత్తు రెండు ద్విచక్ర వాహనాలు దగ్ధమయ్యాయి. జిల్లా కేంద్రానికి చెందిన విజయ కేతన్ తన ఎలక్ట్రిక్ స్కూటీని శివా జీచౌక్‌లోని చించరవాడ హనుమాన్ ఆలయం ఎదుట మంగళవారం పార్కింగ్ చేశాడు. షార్ట్‌సర్క్యూట్‌తో ఎలక్ట్రిక్ బైక్ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పక్కనున్న మరో యాక్టీవకు అంటుకున్నాయి. స్థానికులు మంటలు ఆర్పి వేసేందుకు యత్నించగా, అప్పటికే రెండు వాహనాలు కాలిబూడిదయ్యాయి.

## యువకుడి దారుణ హత్య

**కాగజ్‌నగర్, జూన్ 3 (ప్రభాత సమాచారం)**

మండలంలోని సీబాపు కాలనీ సమీపంలో మంగళవారం సాయంత్రం కాగజ్‌నగర్ పట్టణంలోని ఇందిరా మార్కెట్‌కు చెందిన సయ్యద్ దావుద్ (18) దారుణ హత్యకు గురయ్యాడు. గుర్తు తెలియని వ్యక్తులు బండ రాయితో కొట్టి హత్య చేసినట్లు తెలుస్తోంది. ఐదుగురు వ్యక్తులు గంజాయి సేవించి ఈ దారుణానికి ఒడిగట్టినట్లు స్థానికులు చెబుతున్నారు. యువకుడి హత్యకు ప్రేమ వ్యవహారం లేదా గంజాయి మత్తులో ఎవరైనా ఈ దారుణానికి పాల్పడ్డారా? అనే కోణంలో స్థానికులు అనుమానిస్తున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు సంబంధించి పూర్తివివరాలు తెలియాల్సి ఉంది.

## బైండోవర్ ఉల్లంఘనకు జరిమానా

**మామడ, జూన్ 3 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా మామడ మండలం పరిమండల్ గ్రామానికి చెందిన ఎర్రం సతీశ్ బైండోవర్ ఉల్లంగించినందుకు మంగళవారం రూ. 40 వేల జరిమానా విధించినట్లు నిర్మల్ ఎక్సైజ్ సీఐ రంగస్వామి తెలిపారు. సతీశ్ గతంలో నల్ల బెల్లం, పటిక విక్రయిస్తూ పట్టుబడగా కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. బైండోవర్ ఉల్లంఘించి మళ్లీ నల్ల బెల్లం, పటిక విక్రయిస్తూ పట్టుబడటంతో కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట మంగళవారం హాజరు పర్చారు. తహసీల్దార్ శ్రీనివాస్ రావు రూ.40 వేల జరిమానా విధించారు. కార్యక్రమంలో నిర్మల్ ఎక్సైజ్ ఎస్సై అభిషేకర్, సిబ్బంది ఇర్ఫాన్, వెంకటేశ్, హరీశ్ పాల్గొన్నారు.

## బావిలో పడి వృద్ధుడు మృతి

**బెజ్జూర్, జూన్ 3 (ప్రభాత సమాచారం)**

బెజ్జూర్ మండలం ముంజంపల్లి గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలో పడి వృద్ధుడు మృతి చెందినట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ మంగళవారం తెలిపారు. వ్యవసాయ బావిలో గుర్తు తెలియని వ్యక్తి శవం ఉన్నట్లు స్థానికులు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకున్నాట్లు తెలిపారు. మృతి చెందిన వ్యవసాయ బావి వద్ద ఎర్ర టవల్, చెప్పులు ఉన్నట్లు తెలిపారు.

## ట్రాక్టన్‌ను ఢీకొన్న లారీ.. డ్రైవర్ మృతి

**తాండూర్, జూన్ 3 (ప్రభాత సమాచారం)**

మంగళవారం సాయంత్రం పెగడపల్లి సమీపంలోని పత్తి జిన్నింగ్ మిల్లు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో భూక్య రాజేష్ అనే ట్రాక్టర్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందినట్లు తాండూర్ ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు. బెల్లంపల్లి నుండి ఆసిఫాబాద్ వైపు వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనక నుండి వస్తున్న లారీ ఢీకొంది. ఈ ఘటనలో కాసిపేట మండలం సోమగూడెంకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ రాజేష్ మృతి చెందగా, ట్రాక్టర్‌పై డ్రైవర్ పక్కనే కూర్చున్న రాజు అనే వ్యక్తికి గాయాలయ్యాయి. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# ఏడు నెలల తర్వాత వీడిన హత్య కేసు మిస్టరీ

**హత్యకు దారితీసిన పాత పరిచయం**
**సహజీవనం చేస్తున్న మహిళతో కలిసి చోరీ, హత్య**
**వివరాలు వెల్లడించిన మంచిర్యాల డీసీపీ భాస్కర్**

**మంచిర్యాల, జూన్ 3 (ప్రభాత సమాచారం)**

జిల్లా కేంద్రంలో సంచలనం రేపిన మహిళ హత్య మిస్టరీని ఎట్టకేలకు ఏడు నెలల తర్వాత పోలీసులు ఛేదించారు. హత్యకు పాల్పడిన ఇద్దరిని పోలీసులు స్థానిక రైల్వేస్టేషన్‌లో అరెస్టు చేశారు. మంగళవారం మంచిర్యాల డీసీపీ కార్యాలయంలో డీసీపీ ఎగ్గడి భాస్కర్ వివరాలు వెల్లడించారు. లక్సెట్టిపేట మండలం జెండావెంకటాపూర్ గ్రామానికి చెందిన కూస లక్ష్మి(55) భర్తను వదిలి మంచిర్యాలలోని గణేష్నగర్లో ఒంటరిగా ఉంటూ కూరగాయలు, బియ్యం వ్యాపారం చేసేది. ఈ క్రమంలో కాలేజీరోడ్‌లో నివాసం ఉండే పెద్దపల్లి జిల్లా స్తంభంపల్లికి చెందిన మండలి నరేశ్‌తో పరిచయం ఏర్పడింది. కొంతకాలం తర్వాత హైదరాబాద్‌లోని సుచిత్ర ప్రాంతంలో కుటుంబంతో నివాసం ఉంటూ బార్బర్ వృత్తి



చేసుకుంటూ జీవనం సాగించేవాడు. నరేష్ కుమారుడికి ఆరోగ్యం బాగాలేక అక్కడే ఆస్పత్రికి తీసుకెళ్లగా నర్సు అతినారపు అలివేలుతో పరిచయం పెంచుకుని సహజీవనం చేస్తున్నాడు. జల్సాలకు అలవాటు పడి అప్పుల పాలయ్యాడు. అప్పులు ఇచ్చిన వారు ఒత్తిడి తెచ్చారు. సులువుగా డబ్బు సంపాదనకు దొంగతనం చేయాలని నరేష్ చెప్పగా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న అలివేలు సైతం అంగీకరించింది. మంచిర్యాలలోని లక్ష్మికి భర్త లేడని, డబ్బులు, బంగారం ఉన్నాయని, ఒంటరిగా ఉంటోందని చెప్పి చోరీకి పథకం వేశారు. గత ఏడాది నవంబర్ 26న మంచిర్యాలకు వచ్చి చోరీకి యత్నించి విఫలమయ్యారు. మరునాడు 27న సాయంత్రం 7గంటల ప్రాంతంలో లక్ష్మి ఇంటికి వచ్చిన నరేష్, అలివేలు ఆమె గొంతు నులిమి హత్య చేశారు. ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్ దోచుకుని ఇంటికి తాళం వేసి పారిపోయారు. అదే నెల 30 ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని ఏడు నెలల తర్వాత చిక్కుముడి విప్పారు. నిందితుల నుంచి రెండు తులాల బంగారు నగలు, 20తులాల వెండి పట్టగొలుసులు, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామని, రెండున్నర తులాల బంగారు పుస్తెలతాడు రికవరీ చేయాల్సి ఉందని డీసీపీ వెల్లడించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి మిస్టరీని ఛేదించిన సీఐ ప్రమోద్ రావు, సీసీఎస్ ఎస్సై మధుసూదన్ రావు, ఎస్సైలు ప్రవీణ్ కుమార్, తిరుపతి, కిరణ్ కుమార్, సిబ్బంది మహేష్ బాబు, రాము, సురేష్, జాఫర్, సతీష్లను సీపీ అంబర్ కిశోర్ ఝా, డీసీపీ భాస్కర్ అభినందించడంతో పాటు రివార్డు అందజేశారు.

# ట్రాక్టర్ కిందపడి యువకుడు మృతి



**ముథోల్, జూన్ 3 (ప్రభాత సమాచారం)**

మండలంలోని ఎడ్బీడ్ గ్రామానికి చెందిన ప్రవీణ్ (28)అనే యువకుడు ట్రాక్టర్ కిందపడి మంగళవారం సాయంత్రం మృతి చెందిన సంఘటన వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం అదే గ్రామానికి చెందిన ఒక రైతుకు చెందిన చేనులో ట్రాక్టర్ రోటివేటర్‌తో భూమిని చదును చేస్తుండగా ట్రాక్టర్‌పై కూర్చున్న ప్రవీణ్ ప్రమాదవశాత్తు ట్రాక్టర్ రోటవేటర్‌లో చిక్కుకొని ప్రమాదానికి గురయ్యారు. దీంతో వెంటనే గమనించిన ట్రాక్టర్ డ్రైవర్ ట్రాక్టర్ ఇంజన్ ను బంద్ చేసి చూసేసరికి యువకుడు మృతి చెందారు. మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు శవాన్ని పోస్టుమార్టం తరలించ కుండఅడ్డుకున్నారు. సమాచారం తెలుసుకున్న ముధోల్ ఎస్సై బిట్ల పెర్సిస్ తన సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకున్నారు.ప్రమాద తీరును ఎస్సై స్థానికులు అడిగి తెలుసుకున్నారు. మృతుని బంధువులు బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన దిగారు. మంగళవారం రాత్రి 10 గంటల వరకు సైతం శవాన్ని పోస్టుమార్టం తరలించకుండా కుటుంబీకులు అడ్డుకున్నారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.



## నీటిగుంతలో పడి బాలుడు మృతి

**కుభీర్, జూన్ 3 (ప్రభాత సమాచారం)**

కుభీర్ మండలం హల్దా గ్రామంలో మంగళవారం సాయంత్రం ఓ బాలుడు గుంతలో పడి మృతిచెందాడు. గ్రామానికి చెందిన షల్కె సాయినాథ్ (09) బహిర్భూమికి వెళ్లాడు. తర్వాత చెరువులోని నీటిగుంత వద్దకు వెళ్లాడు. అదుపు తప్పి గుంతలో పడ్డాడు. మొరం కోసం తవ్విన గుంత కావడం, ఇటీవల కురిసిన వర్షాలకు గుంత నిండడంతో నీటిలో మునిగి మృతిచెందాడు. ఒక్కగానొక్క కొడుకు మృతితో తల్లిదండ్రుల గుండెలు పగిలేలా రోధిస్తున్నారు. తండ్రి అనంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## కాలువలో పడి వ్యక్తి మృతి

**లక్ష్మణచాంద, జూన్ 3 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలం వడ్యాల్ గ్రామంలో బహిర్భూమికి వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే వడ్యాల్ గ్రామానికి చెందిన రావులబండి ముత్తన్న(51) మంగళవారం సాయంత్రం గ్రామ సమీపంలోని సరస్వతీ కాలువవైపు కాలకృత్యాల కోసం వెళ్లాడు. ఆకస్మాత్తుగా కాలువలోకి జారీపడిపోయాడు. అటువైపుగా వెళ్లిన స్థానికులు సరస్వతీ కాలువలో మృతదేహం చూసి పోలీసులకు సమాచారం అందించారు. సోన్ సీఐ గోవర్ధన్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మామడ ఎస్సై అశోక్, ఏఎస్సై నారాయణరెడ్డి ఉన్నారు.



# వారు ఎస్టీ కాదు

## ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

**ఇచ్చోడ, జూన్ 3 (ప్రభాత సమాచారం)**

ఇచ్చోడ మేజర్ గ్రామపంచాయతీలో20 ఏళ్లుగా రాజకీయ పదవులు చేపట్టిన చౌహాన్ దేవానంద్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులు ఎస్టీ కాదని నిర్ధారిస్తూ కలెక్టర్ రాజర్షి షా ఉత్తర్వులు జారీ చేయడం సంచలనం రేపింది. దేవానంద్ కుటుంబ సభ్యులు ఎస్టీ కాదని, వారి నకిలీ సర్టిఫికెట్లతో పాటు సాగు భూముల పట్టాలు రద్దు చేయాలని కోరుతూ ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ జిల్లా అధ్యక్షుడు జాదవ్ రెడ్డి నాయక్ ఫిబ్రవరి 7న గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టాలని కలెక్టర్‌ను కమిషనర్ ఆదేశించారు. దీంతో స్పందించిన కలెక్టర్ ఈ వ్యవహారంపై విచారణ చేపట్టాలని అదిలాబాద్ ఆర్డీవో, ఇచ్చోడ తహసీల్దార్‌ను ఆదేశించారు. దీంతో సదరు అధికారులు క్షేత్ర స్థాయిలో వేర్వేరుగా విచారణ చేపట్టి వివరాలు సేకరించారు. దేవానంద్ కుటుంబ సభ్యులు లంబాడా కాదని తేల్చుతూ కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. ఈ మేరకు వారు ఎస్టీ జాబితాలో కొనసాగేందుకు అనర్హులని పేర్కొంటూ కలెక్టర్ తాజాగా ఉత్తర్వులు జారీచేశారు. కాగా దేవానంద్ గతంలో డ ఎంపీటీసీగా ప్రాతినిధ్యం వహించగా, ఆయన ఇద్దరు కూతుళ్లు చౌహాన్ సునిత, ప్రమిళ ఇచ్చోడ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచులుగా పనిచేశారు. ఎస్టీ సర్టిఫికెట్‌తో దాదాపు 20 ఏళ్ల పాటు రాజకీయంగా పదవులను అనుభవించారు. అదే విధంగా వ్యవసాయ భూములకు సైతం ఎస్టీలుగా పట్టాలను పొందారు. దీనిపై అప్పీల్‌కు వెళ్లేందుకు వారికి 30రోజుల ఆవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

## అప్పుల బాధ భరించలేక

# రైతు ఆత్మహత్య

**ఉట్నూర్, జూన్ 3 (ప్రభాత సమాచారం)**



వ్యవసాయానికి పెట్టిన పెట్టుబడులకు చేసిన అప్పులు, కుటుంబ బాధ్యతలు పెరిగిపోవడంతో ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలంలోని శంభుగుడా గ్రామానికి చెందిన రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉట్నూరు మండలంలోని శంభుగూడ గ్రామానికి చెందిన సెడ్మకి పులాజీ రాం (45) సోమవారం గ్రామానికి సమీపంలో ఉన్న పంట చేనులో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. రాత్రి అయినప్పటికీ ఇంటికి రాకపోవడంతో భార్య విజ్జుబాయి బంధువులకు సమాచారం అందించి పంట చేనులోకి వెళ్లి చూడగా స్పృహతప్పి పడి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే ఉట్నూర్ దవాఖానకు తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం జిల్లా కేంద్రంలో రిమ్స్ దవాఖానాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడి తమ్ముడు సెడ్మకి బాధిరావు గత మూడు నెలల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా ఆయన భార్య పిల్లలను వదిలి వెళ్లిపోయింది. దీంతో తమ్ముడికి ఉన్న ఇద్దరు సంతానం తో పాటు తమ్ముడు చేసిన అప్పులతో పాటు తను చేసిన అప్పుల భారం పెరిగిపోవడంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు.



## గంజాయి విక్రయించడానికి వెళ్తు..
# పట్టుబడిన ఇద్దరు వ్యక్తులు

**బోథ్, జూన్ 3 (ప్రభాత సమాచారం)**

మండల కేంద్రంలోని మార్కెట్‌లో మంగళవారం రేండ్లపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు గంజాయి అమ్మకానికి తీసుకురాగా వారిని పట్టుకున్నట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఆత్రం సోమన్న దగ్గర 100 గ్రాములు, సిడం గంగారాం దగ్గర 50 గ్రాముల గంజాయిని మార్కెట్‌లో అమ్ముతుండగా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అంతే కాకుండా ఎవరైనా గంజాయి విక్రయంచినా, సాగు చేసినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

**నిర్మల్, జూన్ 3 (ప్రభాత సమాచారం)**

బైక్, ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఓ యువకుడు గాయపడిన ఘటన నర్సాపూర్(జి) మండలంలో మంగళవారం జరిగింది. బాసరకు చెందిన లక్ష్మీనారాయణ బైక్‌పై నిర్మల్ వైపునకు వెళుతుండగా నర్సాపూర్ (జి) గ్రామ శివారులో 61వ జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో యువకుడికి గాయాలయ్యాయి. 108లో భైంసా ఆస్పత్రికి తరలించారు.

# షార్ట్‌సర్క్యూట్‌తో గడ్డి దగ్ధం

**ఉట్నూర్, జూన్ 3 (ప్రభాత సమాచారం)**

మండలంలోని ఛత్రునగర్ గ్రామంలో రైతు ముజీబ్ ఖాన్‌కు చెందిన డెయిరీఫాంలో నిల్వచేసిన గడ్డి వాము ప్రమాదవశాత్తు దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. డెయిరీ ఫాంలో మంగళవారం ఉదయం షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకుని మంటలు అంటుకున్నాయి. ఈ క్రమంలో అందులో నిల్వ ఉంచిన గడ్డి, చొప్ప కాలిపో యాయి. సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. కాగా, ఆ సమయంలో ఫాంలో గేదెలు, ఆవులు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పినట్లయింది.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని
# ఒకరికి తీవ్ర గాయాలు

**ముథోల్, జూన్ 3 (ప్రభాత సమాచారం)**

ముథోల్ మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ సమీపంలో బాసర-భైంసా రహదారిపై అర్ధరాత్రి గురుతెలియని వాహనం ఢీకొని మహారాష్ట్ర వాసి గాయపడ్డాడు. ఎస్సై బిట్ల పెర్సిస్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా బిలోలి తాలూకా ముదిర్యాల గ్రామానికి చెందిన మహ్మద్మజియాద్ భైంసా నుంచి నిజామాబాద్ వైపు లారీని తీసుకెళుతూ భోజనం కోసం రోడ్డు పక్కన ఆపాడు. భోజనం అనంతరం లారీ వైపునకు వెళ్తుండగా నిజామాబాద్ నుంచి భైంసాకు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో మోజియాద్ కుడికాలు విరిగింది. స్థానికులు 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

# చోరీకి పాల్పడిన నిందితుడి రిమాండ్

**ఆదిలాబాద్, జూన్ 3 (ప్రభాత సమాచారం)**

పట్టణంలో ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. కాలనీకి చెందిన గైక్వాడ్ తిర్పెల్లికి చెందిన ఠాకూర్ నర్సింలు చోరీకి పాల్పడ్డాడు. గ్యాస్ సిలిండర్‌తో పాటు రూ.వెయ్యి నగదు అపహరించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు.

# మహారాష్ట్రలోనే సంచరిస్తున్న ఏనుగులు

**ప్రస్తుతానికి ఎటువంటి ఇబ్బంది లేదు - నిరంతరం అప్రమత్తంగా అటవీశాఖ - అటవీ అధికారుల ప్రకటనతో సరిహద్దు మండలాల ప్రజలకు ఊరట**

**చింతలమానేపల్లి, జూన్ 3 (ప్రభాత సమాచారం)**

తెలంగాణ సరిహద్దు వరకు ఏనుగులు వస్తున్నాయనే హెచ్చరికల నేపథ్యంలో కొంత ఊరట లభించింది. తాజా సమాచారం మేరకు ఏనుగులు మహారాష్ట్రలోని మూల్ తాలూకాలోని సింధెవాయి అటవీ ప్రాంతంలో ఉన్నట్లు తెలుస్తోంది. మంగళవారం జిల్లా అటవీ అధికారి నీరజ్ టిబ్రెవాల్, కాగజ్‌నగర్ అటవీ డివిజన్ అధికారి సుశాంత్ బొగాడె అధికారులను అప్రమత్తం చేశారు. మహారాష్ట్ర అటవీ అధికారుల ద్వారా సమాచారం తెలుసుకున్నారు. గడ్చిరోలి జిల్లా కేంద్రంలో కొద్దిరోజులుగా సంచరించిన ఏనుగులు చాముర్షి అటవీ ప్రాంతం నుంచి వెళ్లి ఆష్టి, గోండప్రి సమీపంలోని పంబూరా అటవీ ప్రాంతంలో సంచరించాయి. వాటి కదలికలు తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన సిర్పూర్(టి), కౌటాల మండలాల వైపు ఉండగా అధికారులు సిర్పూర్ నుంచి కౌటాల, చింతలమానేపల్లి మండలాల ప్రజలను అప్రమత్తం చేశారు. తాజాగా ఏనుగులు మహారాష్ట్ర ఎగువ ప్రాంతం వైపు వెళ్తున్నాయనే సమాచారం మహారాష్ట్ర అటవీ అధికారులు తెలిపారు. సిర్పూర్(టి) రేంజ్ అధికారి, ఖర్జెల్లి ఇంచార్జ్ రేంజ్ అధికారి ఇక్బాల్ మాట్లాడుతూ.. ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఏనుగుల సమాచారం కోసం మహారాష్ట్ర అధికారులతో సంప్రదిస్తున్నట్లు పేర్కొన్నారు. మహారాష్ట్ర అటవీశాఖకు చెందిన ఒకటీం ఏనుగును నిరంతరం గమనిస్తున్నట్లు తెలిపారు. అటవీశాఖ అప్రమత్తంగా ఉందని, ఏనుగులు సరి హద్దు దాటి తెలంగాణలోకి వస్తే ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సరిహద్దు గ్రామాల్లో అవగాహన కల్పించామని, ఏనుగు కదలికలపై ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తున్నామని తెలిపారు.

# ప్రారంభమైన భూ భారతి సదస్సులు

**సారంగాపూర్, జూన్ 3 (ప్రభాత సమాచారం)**

మండలంలోని వైకుంఠాపూర్, కంకేట గ్రామాలలో ఎమ్మార్వో శ్రీదేవి, ఉప తాహ్సిల్దార్ రవీందర్‌తో కలిసి మంగళవారం భూ భారతి రెవెన్యూ సదస్సుల కార్యక్రమాన్ని రెవెన్యూ ఇన్స్పెక్టర్ వెంకట నర్సయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం భూ సమస్యలు ఏవైనా ఉంటే పరిష్కరించుకోవాలని రైతులకు సూచించారు. భూ సంబంధిత పత్రాలు పట్టా పస్ బుక్కులో గాని ఇతర వాటిలో గాని ఏవైనా పొరపాట్లు ఉంటే సరిచేసుకోవాలి వివరించారు. భూ సంబంధిత పత్రాల్లో పొరపాట్లు ఉన్న రైతుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో శ్రీకాంత్ రాకేష్, స్వప్న, సుమన్, యోహాను పాల్గొన్నారు.




# నాణ్యమైన విత్తనంతో అధిక దిగుబడి



**కడెం, జూన్ 3 (ప్రభాత సమాచారం)**

నాణ్యమైన విత్తనంతోనే అధిక దిగుబడి సాధ్యమని జగిత్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శేషు, మండల వ్యవసాయాధికారి పి.దినేశ్ అన్నారు. మండలంలోని పెద్దబెల్లాల్ రైతు వేదికలో 'నాణ్యమైన విత్తనం- రైతన్నకు నేస్తం' కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. సాగులో నాణ్యమైన విత్తనం ప్రాముఖ్యతను రైతులకు తెలియజేశారు. విత్తనాలను పంపిణీ చేశారు. ఇందులో ఏఈవోలు నవీన్, సాయికృష్ణ, శాలిని, రైతులు పొద్దుటూరి సంతోష్ రెడ్డి, అకుల శ్రీనివాస్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారిగా
# దుర్గా ప్రసాద్‌కు అదనపు బాధ్యతలు

**మంచిర్యాల, జూన్ 3 (ప్రభాత సమాచారం)**

జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారిగా షెడ్యూల్డ్ కులాల సహకార సంస్థ ఈ.డి. చాతరాజుల దుర్గాప్రసాద్ పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్‌లో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌ను మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. కాగా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులుగా పని చేసిన పోటు రవీందర్ రెడ్డి మే 31వ తేదీన పదవీ విరమణ పొందారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్ పాల్గొన్నారు.

# చికిత్స పొందుతూ యువకుడు మృతి



**ఆదిలాబాద్, జూన్ 3 (ప్రభాత సమాచారం)**

గత నెల 29న మావల పరిధిలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డుప్రమాదంలో గాయపడ్డ కుడ్మేత దత్తు (23) చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. సీఐ కర్రె స్వామి తెలిపిన ప్రకారం వివరాలు.. మావల మండలంలోని వాఘపూర్ గ్రామానికి చెందిన దత్తు ఆటో ట్రాలీతో భోరజ్ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో మావల శివారులో రోడ్డుకు పక్కన వాహనాన్ని నిలిపి ఆటోపై ఉన్న పరదసరి చేస్తుండగా వెనుక నుంచి వచ్చిన కారు అతడిని వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో దత్తుకు తీవ్ర గాయాలవగా వెంటనే స్థానికులు రిమ్స్కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం వైద్యులు అదే రోజు హైదరాబాద్కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆయనను కుటుంబసభ్యులు సోమవారం మళ్లీ రిమ్స్‌కు తీసుకువచ్చారు. చికిత్స పొందుతూ మంగళవారం వేకువజామున మృతి చెందినట్లు సీఐ తెలిపారు.

# రెవెన్యూ సదస్సులు ప్రతిష్టాత్మకమైనవి



**నిర్మల్, జూన్ 3 (ప్రభాత సమాచారం)**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని భూభారతి-2025 సదస్సులను నిర్వహిస్తున్నదని నిర్మల్ అర్బన్ తహశీల్దార్ రాజు పేర్కొన్నారు. మంగళవారం నిర్మల్ పట్టణంలోని రైతు వేదికలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత, ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్నా, ఎలాంటి సమస్యలు ఉన్న సదస్సులలో ఫిర్యాదులు చేసుకుంటే పరిష్కారం అవుతాయి అన్నారు. ఇందులో ఉప తహసిల్దార్ సామా శ్రీనివాసరెడ్డి, ఆర్ఐలు మొయినుద్దీన్, వెంకటరమణ సిబ్బంది ఉన్నారు.

# స్కూటీని ఢీకొట్టిన లారీ ముగ్గురికి గాయాలు





**సారంగాపూర్, జూన్ 3 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం డ్యాంగాపూర్ గ్రామ శివారు ప్రాంతంలో కల్వర్టు వద్ద మంగళవారం స్కూటీని లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన గుగ్లోత్ శశికాంత్, ఆయన తండ్రి పాల్సీరాం, తల్లి శవంతా బాయి గాయపడ్డారు. గుగ్లోత్ శశికాంత్ తన స్కూటీపై తల్లిదండ్రులను ఎక్కించుకుని ఆదిలాబాద్ వైపు వెళ్తున్నాడు. ఇదేసమయంలో ఎదురుగా నిర్మల్ వైపు వెళ్తున్న లారీ డ్రైవర్ తిరుపతి లారీని అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ స్కూటీని ఢీకొట్టాడు. ఈ ఘటనలో స్కూటీపై వెళ్తున్న ముగ్గురు ఎగిరి కిందపడ్డారు. తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108లో నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు లారీడ్రైవర్ తిరుపతిపై కేసు నమోదు చేశామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

# పేకాట స్థావరాలపై దాడులు

**చింతలమానేపల్లి, జూన్ 3 (ప్రభాత సమాచారం)**

మండలంలోని గూడెం శివారు లో పేకాట స్థావరాలపై మంగళవారం దాడులు నిర్వహించినట్లు ఎస్సై నరేశ్ తెలిపా రు. విశ్వస నీయ సమాచారం మేరకు గూడెం సమీపంలో నిర్వ హించిన దాడుల్లో ఇదే గ్రామానికి చెందిన అభిజిత్ ముజుందార్, కార్ ప్రకాశ్, మల్లేశ్, రాకేశ్ పేకాడుతూ పట్టుబడినట్లు పేర్కొన్నారు. వారి నుంచి రూ.2,140 నగదు, మూడు సెల్ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

# హోంగార్డుల ఆరోగ్య భద్రతపై దృష్టి

## ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఉచిత ఓపీ సేవలు
## ఆరోగ్య భద్రత కార్డులు అందజేసిన ఎస్పీ అఖిల్

ఆదిలాబాద్, జూన్ 3 (ప్రభాత సమాచారం)
పోలీసు వ్యవస్థలో విధులు నిర్వర్తించే హోం గార్డుల ఆరోగ్య భద్రతపై ప్రత్యేక సారించడం జరుగుతోందని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌లో ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రైవేటు వైద్యుల సహకారంతో జిల్లాలో మొట్టమొదటి సారిగా హోంగార్డులకు ఆరోగ్య భద్రతా సేవల్లో స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయంలో జిల్లా ఎస్పీ హోంగార్డులకు ఆరోగ్య భద్రత కార్డులను మంగళ వారం అందజేశారు. ఈ ఆరోగ్య భద్రత పథకంలో జిల్లాలోని 240 హోంగార్డులకు, వారి కుటుంబ సభ్యులకు జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రులలోని కార్పొరేట్ వైద్యం వీలైనంత వరకు రాయితీలో లభించనుందని ఎస్పీ తెలిపారు. లబ్ధి పొందనున్న హోంగార్డులలో 40 మంది మహిళ హోం గార్డు సిబ్బంది మిగిలినవారు పురుష హోంగార్డ్ సిబ్బంది ఉన్నారని, ముఖ్యంగా ఓపి సేవలను ఉచితంగా అందించేందుకు ముందుకు వచ్చిన జిల్లా ప్రైవేటు ఆసుపత్రి వైద్యులకు జిల్లా ఎస్పీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పోలీసు వ్యవస్థలో హోంగార్డులు అతి తక్కు వ జీతంతో నిత్యం పోలీసులతో సమానంగా విధులు నిర్వర్తిస్తూ ఉంటారని, వారు తమ ఆరోగ్యం పట్ల, వారి కుటుంబ సభ్యుల ఆరో గ్యాల పట్ల శ్రద్ధ వహిస్తూ ఉండాలని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీకి జిల్లా హోంగార్డులు ప్రత్యే కంగా ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్, సీసీ రాజు, హోం గార్డు ఆర్.ఐ చంద్రశేఖర్, జిల్లా పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ రమేష్, హోంగార్డు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.





## సాంకేతికత పరిజ్ఞానాన్ని
# వినియోగించుకోవాలి

ఆదిలాబాద్, జూన్ 3 (ప్రభాత సమాచారం)
సైబరేరాల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానం పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఢిల్లీలో ఇటీవల నిర్వహించిన 15 రోజుల సైబర్ శిక్షణలో జిల్లా పోలీసులు పాల్గొ ని ప్రతిభ కనబరిచారు. రిజర్వ్ సన్‌స్పెక్టర్ పి. గోపీకృష్ణ, సైబర్ ల్యాబ్ కానిస్టేబుళ్లు ఎంఏ రియాజ్, జి.త్రిశూల్లు పలు అంశాల్లో ప్రతిభ కనబరిచి తొలి మూడుస్థానాల్లో నిలిచారని పేర్కొన్నారు. వారిని జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ప్రత్యేకంగా అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంతో పాటు, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

# పోడు రైతుల పొట్టకొట్టొద్దు

ఇచ్చోడ, జూన్ 3 (ప్రభాత సమాచారం)
మండలంలోని కేశవపట్నం అటవీ పరిధిలో పోడు భూముల్లో ఏళ్లుగా సాగు చేస్తుకుంటున్న తమను అటవీ అధికారులు అడ్డుకో వడం సరికాదని పలువురు రైతులు పేర్కొన్నారు. ఈమేరకు జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్సరాజ్ గంగారాంకు మంగళవారం ఫ్యాక్స్ ద్వారా వినతిపత్రం పంపినట్లు తెలిపారు. ఏళ్లుగా తాము సాగు చేసుకుం టున్న పోడు భూముల్లో అటవీ శాఖ అధికారులు ప్రస్తుతం మొక్కలు నాటుతున్నారని పేర్కొన్నారు. తమకు న్యాయం చేయాల కోరారు.



# వైద్యకళాశాల విద్యార్థులకు శుద్ధజలం

ఆసిఫాబాద్, జూన్ 3 (ప్రభాత సమాచారం)
ప్రభుత్వ వైద్య కళాశాలల విద్యార్థులకు శుద్ధజలం అందిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే తెలిపారు. మంగళవారం అంకుసాపూర్‌లో వైద్యకళాశాలను అదనపు కలెక్టర్ దీపక్‌తివారీ, డీఎంహెచ్ సీతారాంతో కలిసి సందర్శించారు. శుద్ధజల ప్లాంట్‌ను ప్రారంభించారు. అనంతరం ఇటీవల పోరుగు సేవల్లో ఎంపికైన 52 మంది ధ్రువపత్రాలు పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, బోధన అందించాలని సూచించారు. కళాశాలలో సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని భరోసా కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మి, ఆస్పత్రి పర్యవేక్షకులు పాల్గొన్నారు.

**బడిబాటను పకడ్బందీగా నిర్వహించాలి...**

జిల్లాలో ఈ నెల 6నుంచి 19వరకు బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే సూచించారు. కలెక్టరేట్ కార్యాలయంలో డీఈవో యాదయ్యతో



కలిసి సంబంధిత అధికా రులతో సమావేశమై మాట్లాడారు. బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించేలా చూడాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని సూచించారు. గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించాలని తెలిపారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో మాస్టర్ మైండ్స్ ద్వారా నిర్వహించనున్న ఆన్లైన్ తరగతుల పోస్టర్ ఆవిష్కరించారు. ఎస్వోలు శ్రీనివాస్, మధుకర్, అబిద్ అలీ, డివిజన్ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్ తదితరులున్నారు.

# అర్హులందరికీ సంక్షేమ ఫలాలు : ఎమ్మెల్యే వివేక్



చెన్నూర్, జూన్ 3 (ప్రభాత సమాచారం)
ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందజేస్తామని ఎమ్మెల్యే గడ్డం వివేక్ అన్నారు. స్థానిక గెర్రెకాలనీ, 12వ వార్డులో బోరుపంపులను ప్రారంభించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్లలోపు వినియోగదారులకు ఉచిత కరెంటు వంటి పథకా లు అమలు చేస్తోందని తెలిపారు. పేదలకు ఇంది రమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, యువత ఉపాధి కోసం యువ వికాసం పథకాలు తీసుకొచ్చిందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వి నియోగం చేసుకోవాలని అన్నారు.



## క్రమశిక్షణతోనే ఉన్నత
# స్థాయికి చేరుకోవచ్చు

## ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్
## పోలీసుల ఆధ్వర్యంలో ముగిసిన వేసవి శిబిరాలు

ఆదిలాబాద్, జూన్ 3 (ప్రభాత సమాచారం)
క్రమశిక్షణతోనే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నాలుగు కేంద్రాల్లో నెల రోజుల పాటు నిర్వహించిన వేసవి శిబిరాలు మంగళవారంతో ముగిశాయి. ఆదిలాబాద్ పోలీ సు హెడ్క్వార్టర్స్, నార్నూర్, ఇంద్రవెల్లి, ఇచ్చోడ ప్రాంతాల్లో నిర్వహించిన ఈ శిబిరాల్లో 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమాన్ని పోలీసు హెడ్ క్వార్టర్స్ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ హాజరై మాట్లాడారు. చిన్నప్పటి నుంచే ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకోవాలని విద్యార్థులకు సూ చించారు. అనంతరం విద్యార్థుల నృత్య, యోగా, కరాటే ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శిబిరాలను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేసిన రిజర్వ్ సిబ్బంది, ప్రైవేట్ ఉపాధ్యాయులు, యోగా, కరాటే, గేమ్స్ టీచర్లను ఎస్పీ అభినందించారు. ఇందులో అదనపు ఎస్పీ బి.సురేందర్‌రావు, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్.జీవన్‌రెడ్డి, సీఐ సీహెచ్. కరుణాకర్‌రావు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు డి.వెంకటి, టి.మురళి తదితరులు పాల్గొన్నారు.



## గ్రామాల్లో పకడ్బందీగా
# రెవెన్యూ సదస్సులు

వాంకిడి, జూన్ 3 (ప్రభాత సమాచారం)
ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి రెవెన్యూ సదస్సులను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ దేవిద్ అన్నారు. మంగళవారం మండలంలోని ఘాట్ జనగాం. జైత్పూర్ గ్రామాల్లో చేపట్టిన రెవెన్యూ సదస్సు నిర్వహణ తీరును పరిశీలించారు. భూ సమస్యలపై ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను స్వీకరించి.. వాటిని క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ కవితను ఆదేశించారు.

# ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలి

## అదిలాబాద్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ భవాని ప్రసాద్

నిర్మల్, జూన్ 3 (ప్రభాత సమాచారం)
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో టీజీ ఆర్టీసీ అందిస్తున్న సేవలు ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూర్చడంతో ప్రయాణికులు సంతోషంగా ఉన్నారని అదిలాబాద్ రీజినల్ మేనేజర్ భవాని ప్రసాద్ అన్నారు. మంగళవారం నిర్మల్ డిపోను సందర్శించి అన్ని వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్మల్ డిపో ద్వారా అందిస్తున్న సేవలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేసి ప్రయాణికులకు ఎలాంటి అవసరం ఉన్న ఆర్టీసీ బస్సులను నడపడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఆర్ఎం ను నిర్మల్ డిఎం పండరీ సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది దేవి రావు వీజీ రెడ్డి రమణ ఏఆర్ రెడ్డి తదితరులు ఉన్నారు.



# అంతర్జాతీయ సదస్సులో ఆర్జీయూకేటీ విద్యార్థులు

- హైదరాబాద్‌లోని ఐఐటీలో స్పిక్ మెకే పదో అంతర్జాతీయ సమ్మేళనం
- వారం రోజులపాటు సాంస్కృతిక ఉత్సవం





ముథోల్, జూన్ 3 (ప్రభాత సమాచారం)

ఐఐటీ హైదరాబాద్‌లో స్పిక్ మెకే 10వ అంతర్జాతీయ సమ్మేళనం వారం రోజులపాటు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సమ్మేళనంలో నిర్మల్ జిల్లా బాసరలోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ) నుంచి 35 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ, విద్యార్థులు తమ సాంస్కృతిక చైతన్యం, దేశీయ కళలపై గౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పారని తెలిపారు. ఈ అవకాశం వారి వ్యక్తిత్వ వికాసానికి ఒక గొప్ప వేదికగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు.

**వాలంటీర్లుగా సేవలు...**

దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులకు సహాయం అందించడంలో ఆర్జీయూకేటీ విద్యార్థులు వాలంటీర్లుగా చురుగ్గా పాల్గొన్నారు. వారు తమ సేవల ద్వారా అందరి మన్ననలు పొందారు. అంతేకాకుండా, మీడియా విభాగంలో చేరి స్పిక్ మెకే సమ్మేళనంపై విస్తృతంగా ప్రచారం చేయడంలో కీలక పాత్ర పోషించారు. సమ్మేళనంలో భాగంగా నిర్వహించిన వర్క్‌షాప్‌ల విద్యార్థులు కథక్, కూచిపూడి, భరతనాట్యం, కర్ణాటక సంగీతం, గోండు పెయింటింగ్ వంటి సంప్రదాయ కళలను నేర్చుకున్నారు. ఈ వర్క్‌షాప్‌ల విద్యార్థులకు కళల పట్ల లోతైన అవగాహన, నైపుణ్యాన్ని అందించాయి. స్పిక్ మెకే సమ్మేళనం భారతీయ కళలను ప్రపంచానికి పరిచయం చేయడంతోపాటు, విద్యార్థులకు ప్రముఖ కళాకారులను కలిసే అవకాశాన్ని కల్పించింది. ఈ అనుభవాలు తమ జీవితంలో ఎంతో స్ఫూర్తినిస్తాయని, కళల పట్ల అభిరుచిని మరింత పెంపొందించాయని విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. వారు విద్యార్థులకు మార్గదర్శనం చేస్తూ, కార్యక్రమ విజయంలో కీలక పాత్ర పోషించారు. ఈ కార్యక్రమం ద్వారా వారు నేర్చుకున్న కళలు, పొందిన అనుభవాలు వారి వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితంలో ఎంతో ఉపయోగపడతాయని ప్రొఫెసర్ గోవర్ధన్ అభిప్రాయపడ్డారు. ఈ సమ్మేళనంలో ఆర్జీయూకేటీ నుంచి అధ్యాపకులు డాక్టర్ శ్రవణ్, డాక్టర్ రాకేశ్ రెడ్డి, పూర్వ విద్యార్థులు శివ బాలాజీ, వంశీకృష్ణ, రచన, మణికంఠ పాల్గొన్నారు.





## నీటి సంరక్షణ కోసమే జల్‌సంచాయ్-జన్‌భగీరథి

**జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్**

మంచిర్యాల, జూన్ 3 (ప్రభాత సమాచారం)

జల సంవత్సరం కార్యక్రమాన్ని ప్రాధాన్యత మార్చాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జల సంచాయ్-జల్‌భగీరథి కార్యక్రమం నిర్వహి స్తున్నామని జల్‌శక్తి శాఖ మంత్రి పీఆర్ పాటిల్ పేర్కొన్నారు. మంగళవారం న్యూఢిల్లీ నుంచి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో జల సంరక్షణ జాతీయ ప్రాధాన్యతగా మార్చాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్ర మం ప్రవేశపెట్టిందన్నారు. వర్షపు నీటి సంరక్షణగా నిర్మాణాలు, నీటి నిర్వహణలో సమాజ పాత్ర ముఖ్యమన్నారు. ప్రజలంతా నీటిని స్వ చ్ఛందగా నీటిని పొదుపు చేసే విధంగా అవగాహన కల్పించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి నీటి వనరుల విలువ, సురక్షిత త్రాగునీటి వినియోగం ద్వారా వ్యాధులను వ్యాప్తిని అరికట్టడంపై అవగాహన కల్పించాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటి వనరుల రక్షణపై చర్యలు చేపట్టాలన్నారు. ఇంకుడు గుంతలు నిర్మించుకొని నీటిని కాపాడుకోవాలన్నారు.

# రైతుల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

- రైతులకు విత్తనాలు అందజేత
- 'స్థానిక' ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి
- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఉట్నూర్, జూన్ 3 (ప్రభాత సమాచారం)

రైతుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం ఉట్నూర్ మండలంలోని కొత్తగూడ గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు పెసర్లు, కందులు, జిలుగు విత్తనాలు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొని రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్ కోసం ప్రభుత్వం అందిస్తున్న నాణ్యత వరి విత్తనాలు రైతులకు ఉచితంగా అందించడం ద్వారా భవిష్యత్తులో అధిక దిగుబడి సాధించేందుకు దోహద పడుతుందన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధనల ద్వారా అభివృద్ధి చేసిన ఈ విత్తనాలు, కేవలం పంట దిగుబడిని పెంచడమే కాకుండా, రైతుల ఆర్థిక స్థితిని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. విత్తనాల పంపిణీ అనంతరం, అధి కారులు విత్తనాల వాడక విధానం, పంటల నిర్వహణపై రైతులకు అవగాహన కల్పించారు.

**'స్థానిక' ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి...**

**పెంబి :** పెంబి మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ సంస్థాగత, నిర్మాణ సన్నాహాక సమావేశానికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి ముఖ్యఅతిథిగా పీసీసీ పరిశీలకులు యం.డి అవేజ్,



చంద్రశేఖర్ గౌడ్ హాజరై మండల కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని రానున్న స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా దూసుకుపోవాలని అన్నారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ ప్రతి కార్యకర్త ధైర్యంగా ఉండాలని, కార్యకర్తల క్షేమమే తన భాధ్యత అన్నారు.

విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా సాఫ్ట్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY

## ముంపు రైతులకు న్యాయం జరిగేలా చూడండి



రెబ్బెన, జూన్ 3 (ప్రభాత సమాచారం)

బెల్లంపల్లి ఏరియాలో నూతనంగా చేపట్టనున్న గోలేటి ఓసీపీలో ముంపునకు గురయ్యే భూముల రైతులకు న్యాయం జరిగేలా చూడాలని సోనాపూర్ గ్రామస్తులు బుధవారం హైదరాబాద్లఓ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎమ్మెల్సీ కోదండరాంకు వినతిపత్రాలు ఇచ్చారు. ఎకరాకు రూ.60లక్షలు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించేలా చర్యలు తీ సుకోవాలని కోరారు. సింగరేణి యాజమాన్యం పరిహారం చెల్లింపుల విషయంలో అన్యాయం చేయాలని చూస్తోందని ఆరోపించారు. ముంపునకు గురయ్యే భూముల మార్కెట్ విలువ రూ.60లక్షలు ఉండగా, రిజిస్ట్రేషన్ విలువ రూ.2.25లక్షలుగా చూపిస్తూ రూ.7.5 లక్షలు చెల్లించి లాక్కునేందుకు ప్రయత్నిస్తోందని వాపోయారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్, గ్రామ పటేల్ దొందేరావు, తిరుపతి, మధూకర్ గౌడ్, రైతులు భగవంత్రావు, సదయ్య, అనంతరావు, నవీన్, లక్ష్మణ్, భుజంగరావు, తిరుపతి, సాగర్, శంకర్, రమేశ్, శ్రీనివాస్ ఉన్నారు.



## అభివృద్ధిని విధ్వంసం చేసే చరిత్ర మహేశ్వర్ రెడ్డిది

**మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి**

నిర్మల్, జూన్ 3 (ప్రభాత సమాచారం)

రైతులు మత్స్య కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని తాను ఎంతో కష్టపడి చెక్ డ్యాములు నిర్మిస్తే నిర్మల్ ఎమ్మెల్యేగా గెలిచిన మహేశ్వర్‌రెడ్డి వాటిని విధ్వంసం చేసి చరిత్ర హీనులుగా మిగిలిపోతున్నారని మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. మంగళవారం సోన్ మండలంలోని సాకేర గ్రామం వద్ద స్వర్ణ వాగుపై ప్రభుత్వం ద్వారా నిర్మించిన స్వర్ణ వాగుపై నిర్మించిన కూల్చివేత ప్రదేశాన్ని రైతులతో కలిసి సందర్శించారు. చెక్ డాంలను కూల్చే అధికారం ఇచ్చిన అధికారులపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని త్వరలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఇరిగేషన్ శాఖ అధికారులను కలిసి విన్నవించనున్నట్లు తెలిపారు.



## సుహాసికి బంగారు పతకం

జైనూర్, జూన్ 3 (ప్రభాత సమాచారం)



గేడం సుహాసిని ఇతర విద్యార్థులు ఆదర్శంగా తీసుకొవాలని ఎమ్మెల్యే కోవలక్ష్మి అన్నారు. ఆసియా కప్ పోటీల్లో బంగారు పతకం సాధించిన సిర్పూర్ (యూ) మండలానికి చెందిన గేడం సుహాసిని మంగళవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో అభి నందించి శాలువా కప్పి సన్మానించారు.పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో జరిగే ఆసియా కప్ పోటీల్లో వివిధ దేశాల నుంచి క్రీడాకారులు పాల్గొనగా సుహాసిని ఇండియా తరుపున బం గారు పతకం సాధించడం హర్షణీయమన్నారు.